దేవస్థానం రికార్డు అసిస్టెంట్ సస్పెన్షన్

■ లోపలి పేజీలో..

జేసీ ధాత్రిరెడ్డి బదిలీ



ఏలూరు,సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి బదిలీ అయ్యారు. ఆమెను ఏపీ రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్)కు పూర్తి అదనపు బాధ్యతలతో సీఈవోగా బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ధాత్రిరెడ్డి 2024 జూలై 24న జేసీగా బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలో భూముల సర్వే వేగవంతం చేశారు. సివిల్ సప్లయిస్ వ్యవస్థను గాడిలో పెట్టారు. నిషేధిత భూముల విషయంలో ప్రతీది పర్యవేక్షణ జరిపి, వాటిపై కింద స్థాయిలో సమస్యలను సద్దుమణించే దిశగా యంత్రాంగాన్ని నడిపించారు. ఆమె స్థానంలో జేసీగా ఎవరిని నియమించలేదు. కలెక్టర్ల కాన్ఫరెన్స్ జరుగుతున్న సమయంలోనే సచివాలయానికి రావాలని అక్కడి నుంచి ఫోన్ రావడంతో ధాత్రిరెడ్డి హుటాహుటీన బయలుదేరి వెళ్లారు.

డీపీఆర్వో రామచంద్రరావుకు ఏడీగా పదోన్నతి.. బదిలీ

ఏలూరు,సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సుదీర్ఘకాలంగా సమాచారశాఖలో పనిచేసిన డీపీఆర్వో ఆర్వీఎస్ రామచంద్రరావు రాజమండ్రి సమాచారశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఈయన స్వస్థలం తూర్పుగోదావరి జిల్లా వేమగిరి. అయితే సమాచారశాఖలో తొలి పోస్టింగ్ ఏపీఆర్వోగా రాజమండ్రిలో పొందారు. అనంతరం కాకినాడ, ఏలూరు, విజయవాడల్లో వివిధ హోదాల్లో పనిచేస్తూ డీపీఆర్వోగా 2023లో జిల్లాకు ఇక్కడకు వచ్చారు. కాగా ఈయన స్థానంలో ఇంకా ఎవరిని నియమించలేదు. పదోన్నతిపై బదిలీపై వెళ్తున్న ఆయనకు పలువురు జర్నలిస్టులు, యూనియన్ నేతలు సోమవారం రాత్రి ఘనంగా వీడ్కోలు పలికారు. అందరితో సౌమ్యంగా మెలిగే రామచంద్రరావు సేవలను కొనియాడారు.

చెరువు సర్వేకు బందోబస్తు కల్పించండి

» ఎస్పీకి చినకామనపూడి సర్పంచ్, పంచాయతీ సభ్యుల వినతి

ముదినేపల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం చినకామనపూడిలో పంచాయతీ ఊర చెరువు సరిహద్దులు గుర్తించేందుకు ఈనెల 17న సర్వే శాఖ అధికారులు నిర్వహించనున్న సర్వేకు పోలీసు బందోబస్తు కల్పించాలని ఎస్పీ ప్రతాప్ శివ కిశోర్‌ను ఆ గ్రామ పంచాయతీ పాలకవర్గం కోరింది. ఏలూరులో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సర్పంచ్ చిట్టూరి నాంచారయ్య, ఉప సర్పంచ్ భట్రాజు శ్రీలక్ష్మీ, పాలకవర్గ సభ్యులు ఎస్పీని కలసి వినతి పత్రం అందజేశారు. చెరువు ఆక్రమణలు తొలగించి తవ్వించేందుకు పంచాయతీతో పాటు గ్రామసభ ఏకగ్రీవంగా తీర్మానించిందని, గతంలో మండల సర్వేయర్, డివిజన్ సర్వేయర్ చెరువును సర్వే చేసేందుకు రాగా స్థానిక నాయకులు కొందరు అడ్డుకున్నారని తెలిపారు. ఈనెల 17న డివిజనల్ సర్వేయర్ చెరువు సర్వే నిర్వహించనున్నారని, అందుకు పోలీసు బందోబస్తు కల్పించాలని కోరగా, తాను కైకలూరు రూరల్ సీఐకి ఆదేశాలిస్తానని ఎస్పీ తెలిపారు.

నేడు జాబ్‌మేళా

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏలూరులోని కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలోని జిల్లా సెట్‌వెల్ కార్యాలయం వద్ద ఈనెల 16వ తేదీ ఉదయం 11 గంటలకు జిల్లా ఉపాధి కార్యాలయం, నేషనల్ కెరీర్ సర్వీస్, సెట్‌వెల్ సంయుక్త ఆధ్వర్యంలో జాబ్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి వి.వరలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో రాయల్ ఎన్‌ఫీల్డ్, టాటా ఎలక్ట్రానిక్స్, ఎన్ఎస్ ఇనిస్ట్రుమెంట్స్, కాల్గెట్ పామాలిన్, భారతి ఆక్సా లైఫ్ ఇన్సూరెన్స్ తదితర ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తారన్నారు. వేతనాలు రూ.16,500 నుంచి రూ.19,500 వరకు ఉంటుందన్నారు. ఇంట ర్మీడియట్ అర్హత ఉన్న మహిళలకు రూ.18 వేల వేతనంతో ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.

ఎన్నాళ్లో వేచిన ఉదయం

ఉమ్మడి పశ్చిమలో 1063 ఉపాధ్యాయ ఉద్యోగాలకు అభ్యర్థుల ఖరారు

13 మంది ఏవోలకు ఎంపీడీవోలుగా పదోన్నతి

■ లోపలి పేజీలో..



సదస్సులో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు, పాల్గొన్న మంత్రులు

క్షేత్రస్థాయిలో పర్యటించండి!

» కలెక్టర్లకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం
» వ్యవసాయ, అనుబంధ రంగాల్లో ఏలూరుకు నాల్గొవ స్థానం
» పరిశ్రమల్లో 9, సేవారంగంలో 13వ స్థానం
» స్థూల జాతీయోత్పత్తిలో 14వ స్థానం
» జిల్లా స్థితిగతులపై నివేదించిన కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): 'జిల్లా బాస్‌లుగా క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవాలను గ్రహించినప్పుడే ప్రభుత్వ పథకాలు కిందిస్థాయికి వెళతాయి. కలెక్టర్లుగా పని చేయడం, ప్రజలకు దగ్గరుండి సేవ చేసే అవకాశం మీకు రావడం అదృష్టమే. కొంత మందిని మార్చడం ఉద్దేశ్యం వెనుక వివిధ శాఖల్లో మెరుగ్గా పనిచేసే వారికి అవకాశం ఇవ్వడం కోసమే. ఇప్పుడు కొనసాగిస్తున్న కలెక్టర్లు ఇంకా మెరుగ్గా పనిచేయాలి' అంటూ సీఎం చంద్రబాబునాయుడు దిశా నిర్దేశం చేశారు. సచివాలయం వేదికగా సోమవారం ప్రారంభమైన కలెక్టర్ల సదస్సులో ఆయన మాట్లాడుతూ కలెక్టర్లు ఎలా ఉండాలి.. పనితీరు ఎలా మెరుగుపర్చుకోవాలో విశదీకరించారు. సీఎం తర్వాత కలెక్టర్లే..అత్యంత కీలకమైన వ్యక్తులని తెలిపారు. జిల్లా రూపురేఖల్ని మార్చడంలో వారిదే ప్రధాన పాత్ర అంటూ వారికి కర్తవ్యాన్ని నూరిపోశారు. పనితీరు చక్కగా ఉన్న వాళ్లను నేను ఎప్పుడు మార్చలేదని గుర్తు చేశారు. ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు వివరించారు. కాగా జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ రంగాలు, వివిధ రంగాల్లో సాధించిన వృద్ధిని కలెక్టర్ వెట్రిసెల్వి మంగళవారం సదస్సులో వివరించే అవకాశం ఉంది. కలెక్టర్‌తో పాటు మంత్రి కొలుసు పార్థసారధి హాజరయ్యారు.



సదస్సులో పాల్గొన్న కలెక్టర్ వెట్రిసెల్వి

జిల్లా వృద్ధి ఇలా..

రాష్ట్రవ్యాప్తంగా మిగతా జిల్లాలతో ఏలూరు జిల్లా పోటీ పడింది. జిల్లా వ్యవసాయ, అనుబంధ రంగాల అభివృద్ధిలో నాల్గొ స్థానం, పారిశ్రామిక రంగంలో 9వ స్థానం, సేవారంగంలో 13వ స్థానం, స్థూల జాతీయోత్పత్తిలో 14వ స్థానంలో నిలిచింది. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో వృద్ధి రేటు గతం కంటే ఈసారి జిల్లాలో రెండుశాతం సాధించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 9వేల410 కోట్లతో 57.66 శాతంగా ఉన్న ఏలూరు జిల్లా, నాల్గొవ సదస్సు నాటికి 10వేల180 కోట్లకు విస్తరించి 59.06 శాతంతో నాల్గో స్థానం కైవసం చేసుకుంది. పరిశ్రమల రంగంలో గతేడాది 2వేల524 కోట్లు (15.46 శాతం) వృద్ధి రేటు ఉంది. తాజా ఇది 2వేల179 కోట్లకు పడిపోవడంతో వృద్ధిరేటు 2.90 మేర తగ్గడంతో 9వస్థానానికి దిగజారింది. సేవారంగంలో గడిచిన క్వార్టర్‌కు 4వేల385 కోట్లతో 26.88 శాతంతో ఉండగా, తాజాగా 4వేల877 కోట్లు పెరగడంతో 28.30 శాతం వృద్ధితో 13వ స్థానాన్ని జిల్లా సాధించింది.

ఫిషరీస్‌లో టాప్..

2024 ఫిషరీస్‌లో ఏలూరు జిల్లా టాప్‌లో నిలిచింది. 29వేల211 కోట్లతో వృద్ధి సాధించింది. టాప్ 20 మండలాల్లో ఏలూరు జిల్లాలోని కలిదిండి (5,563కోట్లు)తో ప్రథమ స్థానంలో నిలవగా, కైకలూరు (3), మండవల్లి(6) ముదినేపల్లి (10), ఏలూరు రూరల్ (11), పెదపాడు(17), నిడమర్రు (20) స్థానాల్లో నిలిచాయి. పరిశ్రమల ర్యాంకింగ్‌లో 55 పాయింట్లతో జిల్లా 21వ స్థానంలో నిలిచింది. సేవా రంగంలో ర్యాంకింగ్‌లో 85 పాయింట్లతో 11వ స్థానంలో నిలిచింది.



సదస్సులో పాల్గొన్న మంత్రి పార్థసారథి



విచారణ జరుపుతున్న అధికారులు భూషణం, విజయ్‌కుమారి

రూ.58 లక్షల కైంకర్యంపై విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆగిరిపల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి):ఆగిరిపల్లి మండలం సీతారాం పురంలో వెలుగు మహిళా గ్రూపుల నిధులు కైంకర్యం అయ్యాయని ఈనెల 13వ తేదీన 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనంపై అధికారులు స్పందించారు. ఈ మేరకు సోమవారం జిల్లా అధికారులు విచారణ నిర్వహించారు. ఈ విచారణలో రూ.58 లక్షల నిధులు గల్లంతు అయ్యాయని తేల్చారు. గ్రామం లోని రైతుభరోసా కేంద్రంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజరు ఎం.ఎస్.డీ భూషణం, ఐ.బి.డి.పి.ఎం. వై.డి విజయ్‌కుమార్, ఏజీఎం కె.చెన్నకేశవులు సంయుక్తంగా విచారణ నిర్వహించారు. ఈ విచారణలో గ్రూపు సభ్యుల్లో 300 మంది వరకు హాజరయ్యారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న బుక్‌కీపర్ భవానీ సమక్షంలో గ్రూపు సభ్యులను పిలిపించి విడివిడిగా గ్రూపువైజ్‌గా విచారణ నిర్వహించా రు. విచారణ అధికారులు భూషణం, విజయ్‌కుమార్ మాట్లాడుతూ శ్రీనిధి, లోన్‌లలో రూ.58 లక్షల వరకు జరిగాయని తమ విచారణలో తేలిందన్నారు. సభ్యులు నష్టపోకుండా న్యాయం చేస్తామని తెలిపారు. ఈ విచారణ ఉద యం 11 గంటలకు ప్రారంభమై రాత్రి 8.30వరకు జరిగింది. ఎట్టకేలకు నిధు లు కైంకర్యం లెక్క తేల్చారు. ఈ నిధులు రాబట్టే విషయంపై బుక్‌కీపర్‌ను ప్రశ్నించి తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. 'స్వయంగా ఈదర వెళ్లి ఇండియన్ బ్యాంకులో లోన్ కట్టాం. కాని మా లోన్‌కి మేము కట్టిన డబ్బులు జమ కాలేదని బ్యాంకు మేనేజరు అంటున్నారు. మా లోన్ అకౌంట్ నుంచి బుక్‌కీపర్ ఎలా డబ్బు డ్రా చేసిందో అర్థం కావడం లేదు' అని చిన్ని రంగమ్మ తెలిపింది. 'బ్యాంకులో అమౌంట్ వేయడానికి వెళుతుంటే.. నేను బ్యాంకుకు వెళుతున్నాను అని చెప్పి బుక్‌కీపర్ మా దగ్గర డబ్బులు తీసుకుంది. మా అకౌంట్లో డబ్బులు లేవు అంటున్నారు. మాకు న్యాయం చేయాలి' అంటూ ఖాజా రజినీ అధికారుల వద్ద వాపోయింది. కాగా తనవల్ల జరిగిన పొరపాటును అంగీకరిస్తూ రెండునెలలు గడువు ఇస్తే పొలాన్ని అమ్మి ఎవరి డబ్బులు వారికి ఇస్తానని అధికారులు సభ్యుల సమక్షంలో బుక్‌కీపర్ భవానీ హామీ ఇచ్చింది. అయితే దీనిపై ఉన్న తాధికారులను సంప్రదించి మంగళవారం తుది నిర్ణయం తీసుకోవడానికి అధికారులు నిర్ణయించారు.

మళ్లీ గోదావరీ!

» 42 అడుగుల వరకు పెరిగే అవకాశం
» వేలేరుపాడులో నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు, ఎద్దువాగు, టేకూరు వాగు వంతెనలు



టేకూరు-ఎడవల్లి మధ్య రోడ్డుపై నిలిచిన వరదనీరు

వేలేరుపాడు/కుక్కునూరు/పోలవరం,సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): గోదావరికి మరలా వరద పోటెత్తుతోంది. గోదావరి ఎగువ భాగాన తెలంగాణలోని పలు జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో వరద మరల పెరుగుతోంది. సోమవారం సాయంత్రానికి భద్రాచలం వద్ద 39.7 అడుగులు నీటిమట్టం నమోదు కాగా ఇది మరింతగా పెరిగి 42 అడుగుల వరకు పెరగవచ్చని సీడబ్ల్యూసీ అధికారులు ప్రకటించారు. ప్రస్తుతం గోదావరికి వస్తున్న వరద, పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ప్రభావంతో మండలంలోని కోయిదా దాని పరిసర గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు, రహదారుల పైకి వరద వచ్చి చేరింది. ఎద్దువాగు వంతెన, టేకూరు వాగు వంతెన నీట ముని గాయి. దాదాపు 15 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అత్యవసర పనుల మీద మండల కేంద్రానికి వచ్చే వారి కోసం ఈ రెండు వంతెనల వద్ద అధికారులు పడవలు ఏర్పాటు చేశారు. వరద భయం తప్పిపోయిందన్న ఉద్దేశంతో వేలేరుపాడు మండలంలో కొంతమంది రైతులు మిర్చి పంటను ఇటీవల వేశారు. వరద మరింత పెరిగితే మిర్చి తోటలు మునిగిపోయే ప్రమాదం ఉండడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. కుక్కునూరు మండలం గోదావరి తీర ప్రాంతంలో ప్రస్తుతం మిర్చి వేయా ల్సిన సమయం కాగా వరద భయంతో మిర్చి సాగు ఆలస్యమయ్యే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.

పోలవరంలో గోదావరి నీటిమట్టం సోమవారం అనూహ్య రీతిలో పెరిగింది. పట్టిసీమ శివక్షేత్రం వద్ద వరద జలాలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పోలవరం మండలంలో ఏజెన్సీ కొండవాగులు కొవ్వాడ కాలువ, రేపల్లెవాడ, గుంజవరం, జిల్లెల్లగూడెం కొండ వాగులు ఉధృతంగా ప్రవహిస్తూ పట్టిసీమ అవుట్ ఫాల్ స్లూయిజ్ రెగ్యులేటర్‌లో 23 గేట్ల ద్వారా గోదావరిలో కలుస్తున్నాయి. కొండవాగులు దాటే విషయంలో అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు ప్రజలకు హెచ్చరికలు చేశారు.

పొంగిన జల్లేరు కొండవాగు

బుట్టాయగూడెం: ఏజెన్సీలో (మిగతా 8వ పేజీలో)

• జిల్లాలో వర్షపాతం వివరాలు

ఏలూరుసిటీ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి బలహీన పడినా జిల్లాలో సోమవారం భారీగానే వర్షాలు కురిశాయి. ఏజెన్సీ మండలాల్లో భారీగా వర్షాలు కురియడంతో వాగులు పొంగాయి. గత24 గంటల్లో జిల్లాలోనే అత్యధికంగా దెందులూరు మండలంలో 53.6 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 5.5 మి.మీగా నమోదైంది. ఏలూరు అర్బన్ 45.4, పెదవేగి 34.6, ఏలూరు రూరల్ 7.6, ఆగిరిపల్లి 3.2, మండవల్లి 2.8, నూజివీడు 2.6, కైకలూరు 2.2, పెదపాడు 1.6 మి.మీ వర్షపాతం నమోదైంది.



రెడ్డిగణపవరం జల్లేరు కొండవాగు పొంగడంతో వేచిఉన్న వాహనదారులు



• నీట మునిగిన శివాలయం

ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల మండలం తిరుమలంపాలెంలోని శివాలయం సోమవారం వర్షం నీటితో మునిగింది. ఉదయం నుండి ఎడతెరపి లేని వర్షం కారణంగా వర్షం నీరు గర్భాలయంలోకి చేరింది. వర్షం నీటిలో భక్తులు, తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి

అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలి

» జేసీ ధాత్రిరెడ్డి..268 వినతుల స్వీకరణ

ఏలూరు రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అందిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను జేసీ పి.ధాత్రిరెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తం 268 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్జీలను క్షుణంగా పరిశీలించి గడువులోగా సత్వర పరిష్కార చర్యలు తీసుకోవాలన్నారు. డీఆర్వో విశ్వేశ్వరరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముక్కంటి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవకీదేవి, డీఆర్‌డీఏ ఈడీ విజయరాజు, జడ్పీ సీఈవో శ్రీహరి తదితర అధికారులు అర్జీలు స్వీకరించారు.

సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండండి : ఎస్పీ



ఏలూరు క్రైం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి):అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెస్సేజ్‌లకు స్పందించవద్దని ఎస్పీ కొమ్మి ప్రతాప శివ కిశోర్ జిల్లా ప్రజలకు సూచించారు. ఏలూరులోని జిల్లా పోలీస్ కార్యాలయం లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఏఎస్పీ సూర్యచంద్రరావుతో కలసి ఆయన 48 ఫిర్యాదులు స్వీకరించారు. ఎస్పీ ప్రతి ఫిర్యాదుదారుడితో మాట్లాడి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రతి ఫిర్యాదు స్థితిగతులను 1100కు కాల్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

మట్టి దందా!

» ఆగిరిపల్లి మండలంలో యథేచ్ఛగా తవ్వకాలు
» పట్టించుకోని అధికారులు

(నూజివీడు-ఆంధ్రజ్యోతి)

ఆగిరిపల్లి మండలంలో అనేక గ్రామాల్లో కొండలు, గుట్టలు లూటీ అవుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండానే రాత్రి వేళల్లో మట్టిమాఫియా ఈ దురాగతాలకు పాల్పడుతోంది. అధికారులకు ఫిర్యాదులు అందినా ఏ చర్యలు లేకపోవడంతో మట్టి మాఫియా మరింత బరితెగిస్తూ యథేచ్ఛగా మట్టి, గ్రావెల్ తవ్వకాలను జరుపుతోంది. ఆదివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో ఆగిరిపల్లి మండలం వడ్లమాను-నూజివీడు రహదారి పక్కనే ఉన్న సూదిగట్టును ఎక్స్‌కవేటర్ సాయంతో తవ్వి 25 ట్రాక్టర్లలో తరలిస్తున్న విషయాన్ని విలేకరులు తహసీల్దార్ పీఎస్‌వీ ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. రెవెన్యూ అధికారులు ఎస్ఐకి సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్ఐ శేఖర్ ఘటనా స్థలికి వెళ్లి అక్రమ తవ్వకాలను ఆపి వాహనాలను పంపించి వేశారే తప్ప వాటిని అదుపులోకి తీసుకోలేదు. దీనిపై ఎస్ఐ వివరణ తీసుకునేందుకు ఫోన్ చేయడంతో ఆయన ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోంది. మండలంలో వారం రోజులుగా అమ్మవారిగూడెం, నరసింగపాలెం గ్రామాల్లో అక్రమ మట్టి తవ్వకాలు జరిగాయి. సోమవారం వర్షం పడడంతో తవ్వకాలు నిలిచిపోయాయి.



వడ్లమాను సూదిగట్టు వద్ద జరిపిన మట్టి తవ్వకాలు



(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

ఇళ్లు సరే.. ఇంకుడు గుంతలేవీ?

» ప్లాన్ అప్రూవుల్‌లోనే ఇంకుడు ప్రస్తావన
» చోద్యం చూస్తున్న నగర, పురపాలక అధికారులు

భూగర్భ జలాల పరిరక్షణతో నీటి మట్టాలు పెరుగుతాయి. తద్వారా నీటి కొరతను అధిగమించవచ్చు. ప్రతీ నీటిబొట్టును సద్వినియోగించుకోవచ్చనే ఉద్దేశ్యంతో ఇంకుడు గుంతల నిర్మాణానికి టీడీపీ సర్కారు పెద్దపీట వేస్తోంది. భూగర్భ జలాల పెంపునకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నా.. పలు పథకాల పేర్లతో రూ.కోట్ల వ్యయం చేస్తున్నా.. ఆ లక్ష్యాన్ని నెరవేర్చడంలో నగర పాలక సంస్థ, మునిసిపాలిటీలు, నగర పంచాయతీలు విఫలం అవుతున్నాయి. ఫలితంగా భూమిలోకి నీరు ఇంకక భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. కార్పొరేషన్, మునిసిపాలిటీలు ఇల్లు కట్టే ప్రతీ ఒక్కరూ ఇంకుడు గుంత నిర్మించాలన్న నిబంధన ఉన్నా.. అది కాగితాలకే పరిమితమవుతోంది. ఈ విషయంలో అధికారులు ఉదాసీనతే కారణంగా తెలుస్తోంది. సర్కారు నిబంధన ప్రకారం 50 ప్లాట్లు ఉన్న అపార్టుమెంట్‌లో ఇం కుడు గుంత ఉండాలి. ఎక్కడైనా మచ్చుకైనా కనిపిం చదు. జిల్లాలో ఏలూరు కార్పొరేషన్‌లో మూడు లక్షల పైబడి జనాభా ఉంటే దాదాపుగా 77 వేల ఇళ్లు ఉన్నాయి. చింతలపూడిలో 10 వేలు, జంగారెడ్డిగూడెంలో 20 వేలు, నూజివీడులో 35 వేలకు పైబడి నివాస భవనాలున్నాయి. ఏటా ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నా ప్లాన్‌లు పొందేవారు ఇంకుడు గుంతల నిర్మాణాన్ని అటకెక్కిస్తున్నారు. ఫలితంగా ఇంకుడు గుంతల్ని వేళ్లపై లెక్కించ వచ్చు. కొన్ని పురపాలక సంఘాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో (మిగతా 8వ పేజీలో)



సమావేశంలో మాట్లాడుతున్న పత్రిక సంపాదకులు సతీష్ చందర్

ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైంది

తణుకు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైనదని ప్రముఖ పత్రిక సంపాదకులు సతీష్ చందర్ అన్నారు. సామాజిక న్యాయపోరాట సమితి, తణుకు స్టడీ సర్కిల్, బ్లూవింగ్స్ ఫౌండేషన్ సంయుక్తంగా 'ఓటు రక్షకులే ఓటు భక్షకులా' అంశంపై ఆదివారం రాత్రి సమావేశం నిర్వహించారు. సతీష్ చందర్ మాట్లాడుతూ ఓటును రక్షించాల్సిన ప్రభుత్వ నేతలు భక్షకులుగా మారితే ప్రజాస్వామ్యం మనజాలదన్నారు. ఓటర్‌ను నేను బతికే ఉన్నానని నిరూపించుకో అనే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజాస్వామ్యం కూలిపోయి నియంతృత్వ పోకడకడలు వస్తాయని బాబాసాహెబ్ అంబేడ్కర్ 1919లోనే పేర్కొన్నారన్నారు. మన ఓటు మనం రక్షించుకోవడమే పెద్ద పనిగా ఏర్పడిందని, మనం బతికే ఉన్నామని నిరూపించుకోవాల్సిన పరిస్థితులు ప్రభుత్వాలు కల్పించడం దురదృష్టకరమని చెప్పారు. ఎన్నికల కమిషన్ స్వయంప్రతిపత్తి గల వ్యవస్థ అని నిరూపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక న్యాయపోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పేరేరి మురళీకుమార్, గౌరవాధ్యక్షుడు గొల్లపల్లి అంబేడ్కర్, దారి దీపం సంపాదకులు డీవీవీఎస్.వర్మ, తణుకు స్టడీ సర్కిల్ డాక్టర్ బి.రమేష్‌చంద్రబాబు, సంకు మనోరమ, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

రేపు చిట్టూరి ఇంద్రయ్య కాలేజీలో ఉద్యోగ మేళా

తణుకు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): చిట్టూరి ఇంద్రయ్య డిగ్రీ కాలేజి లో ఈనెల 17న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ ఏడుకొండలు సోమవారం తెలిపారు. స్టేట్ స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్, నేషనల్ కెరీర్ సర్వీస్ సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగ మేళాలో హెటిరో ఫార్మా, ముత్తూట్ ఫైనాన్స్, అపోలో ఫార్మసీ, రాయల్ ఇన్‌ఫీల్డ్ వంటి పలు కంపెనీలు పాల్గొంటాయన్నారు. 16 నుంచి 45 ఏళ్ల లోపు, పది నుంచి డిగ్రీ, డిప్లమో అర్హత ఉన్న అభ్యర్థులు పాల్గొనవచ్చన్నారు. ఉద్యోగం బట్టి నెలకు రూ.10 వేల నుంచి రూ.30 వేల జీతం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాల కోసం 9618560188, 9440838388 నెంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.


పశ్చిమ గోదావరి జిల్లా అథ్లెటిక్స్ జట్లకు ఎంపికైన విద్యార్థులు

జిల్లా అథ్లెటిక్స్ జట్ల ఎంపిక

తణుకు రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి అండర్ 14, 16, 18, 20 విభాగాలలో అథ్లెటిక్స్ జట్లకు క్రీడాకారులను ఎంపిక చేసినట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంకు సూర్యనారాయణ తెలిపారు. తణుకులో సోమవారం ఎంపిక పోటీల్లో జట్లు ఎంపిక చేశామన్నారు. పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 200 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో 42 మంది వివిధ జట్లకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 27, 28, 29 తేదీలలో ఏలూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా తరపున పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.సత్యనారాయణ, చైర్మన్ మానేపల్లి శ్రీనివాస్, కోశాధికారి కె.బాబూరావు, హెచ్ఎం పద్మావతి, వ్యాయామ ఉపాధ్యాయులు ఎన్.సత్యనారాయణ, కె.సుబ్బారావు, వి.అనంతలక్ష్మి, పి.దైవజ్యోతి, ఎం.నాగరాజ్యం, ఎం.విజయదుర్గ, కె.అనిల్, బి.భాస్కర్, ఆర్.రవి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు జిల్లా జట్టు ఎంపిక

ఏలూరు రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం అల్లూరి సీతారామరాజు స్టేడియంలో అథ్లెటిక్ జిల్లా జట్లు ఎంపిక నిర్వహించారు. అండర్ 14, 16, 18, 20 విభాగాల్లో బాలబాలికలకు పోటీలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 250 మంది హాజరయ్యారని, ప్రతిభ కనపరచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి దేవరపలి ప్రసాద్ తెలిపారు. అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ ఆదిరెడ్డి సత్యనారాయణ, అధ్యక్షులు గుళ్లా ప్రసాదరావు, జల్లా వీరభద్రరావు ఎంపిక పోటీలను పర్యవేక్షించారు.

కరాటేలో గోల్డ్‌మెడల్ సాధించిన హనీ


పతకం సాధించిన గుర్రం హనీ

టి.నరసాపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో 7వ తరగతి విద్యార్థిని గుర్రం హనీ గోల్డ్‌మెడల్ సాధించినట్లు ఆమె తండ్రి గుర్రం నాగరాజు సోమవారం తెలిపారు. పుట్రేపు గ్రామానికి చెందిన గుర్రం నాగరాజు, భారతి దంపతుల కుమార్తె హని సుమన్ రాజు పర్యవేక్షణలో కరాటే శిక్షణ పొందింది. ఈ నెల 14న అమలాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి 5వ ఇంటర్‌స్టేట్ ఇన్విటేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ 2025 పోటీల్లో ఉత్తమ ప్రతిభకనపరిచిన హనీ బంగారుపతకం సాధించింది. ఆమెను పాఠశాల హెచ్ఎం సిస్టర్ సోఫియా, కరస్పాండెంట్ సిస్టర్ దినియా, సిబ్బంది, పుట్రేపు గ్రామపెద్దలు అభినందించారు. చిన్నతనంలోనే కరాటేలో బంగారు పతకం సాధించటం ఆనందంగా ఉందని కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

నాడు మెడికల్ కాలేజీల పేరుతో నిధులు పక్కదారి

» మాజీ మంత్రి పీతల సుజాత

అమరావతి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల పేరుతో వైసీపీ కొత్త నాటకాలకు తెరతీసిందని మాజీ మంత్రి పీతల సుజాత అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 17 వైద్య కళాశాలల గురించి జగన్ రెడ్డి గొప్పలు చెప్పుకుంటున్నారని, కానీ మెడికల్ కాలేజీల పేరుతో అప్పులు చేసి ఆ నిధులను పక్కదారి పట్టించిన విషయాన్ని ఎందుకు దాస్తున్నారని ఆమె ప్రశ్నించారు. ఆ విషయాన్ని కూడా ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.

పంట కాల్వ కాదు.. మురుగు డ్రెయిన్!

ఆకివీడు శలకోడు దుస్థితి


చెత్తా, చెదారంతో మురుగు డ్రెయిన్‌ను తలపిస్తున్న శలకోడు


తూడు, గుర్రపుడెక్కతో పూడుకుపోయిన పంట కాల్వ

ఆకివీడు సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): చేలకు సాగు నీరందించే శలకోడు మురుగు డ్రెయిన్‌ను తలపిస్తోంది. వెంకయ్య వయ్యేరు నుంచి ప్యాటిక్‌నగర్, గుమ్ములూరు సెంటర్ మీదుగా సాయిదుర్గ నగర్, గాంధీ నగర్ ప్రాంతంలో చేలకు శలకోడు ద్వారా సాగు నీరందుతుంది. మూడు దశాబ్దాలుగా సాయిదుర్గనగర్, గాంధీనగర్‌లో ఇళ్ల, ఇతర నిర్మాణాలతో పంట కాల్వ ఆక్రమణలతో పూడుకుపోయింది. నీటి పారుదల లేకపోవడంతో తూడు, గుర్రపుడెక్క, నాచు పేరుకుపోయింది. ఇళ్లలో మురుగు, చెత్త కాల్వలో చేరడంతో మురుగు డ్రెయిన్‌గా మారిపోయింది. అపారిశుధ్యం, దోమలతో స్థానికులు అనారోగ్యం బారిన పడుతున్నారు. పలుమార్లు పాలకులు, అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానిక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు మురుగు నీటి రోడ్డు నీట మునుగుతోంది.

ప్రోబ్లమ్ జోన్


బుట్టాయగూడెం-జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారిపై గోతులు

రోడ్డంతా గోతులే..!

బుట్టాయగూడెం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఈ మార్గంలో వెళితే రోడ్డు కనిపించదు.. రోడ్డంతా గోతులే..! బుట్టాయగూడెం-జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారి అడుగడుగునా గోతులతో ప్రమాదభరితంగా మారింది. ఏజెన్సీ ప్రజలకు ముఖద్వారంగా పిలువబడే ప్రధాన రహదారిలో రోడ్డు పూర్తిగా గుంతలు పడడం నరక మార్గమని వాహనదారులు వాపోతున్నారు. రెండు గ్రామాల మధ్య సుమారు ఏడు కిలో మీటర్ల వరకు రోడ్డు అధ్వానంగా కావడంతో కొత్తగా రోడ్డు నిర్మించడానికి యంత్రాలతో తవ్వేశారు. కానీ క్వారీ రజనుతో సరిపెట్టడంతో వర్షాల ధాటికి ఇలా గోతులతో దర్శనమిస్తోంది. మరో మార్గం లేక ఇదే రోడ్డుపై ప్రయాణాలు చేస్తూ ప్రమాదాల బారినపడి ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. మరోవైపు వాహనాలు సైతం మరమ్మతులకు గురవుతున్నాయి. ఏజెన్సీకి వచ్చే అధికారులు రోడ్డు దుస్థితి గమనించి ఏలూరు నుంచి నల్లజర్ల-కొయ్యలగూడెం మీదుగా బుట్టాయగూడెం, ఏజెన్సీ గ్రామాలకు రాకపోకలు సాగిస్తున్నారు. అధికారులు, పాలకులు ఎప్పుడు స్పందిస్తారో..?


గోతులతో అధ్వానంగా మారిన బోడపాడు రహదారి

పెంటపాడు-బోడపాడు దారేది!

పెంటపాడు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పెంటపాడు - బోడపాడు రహదారి గోతులతో అధ్వానంగా తయారైంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఈ రహదారి వైపు కన్నెత్తి చూడలేదు. రహదారి మొత్తం గోతులతో రాకపోకలు సాగించలేని పరిస్థితి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత బోడపాడు గ్రామస్తులు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. రహదారిపై ప్రయాణం ప్రమాదభరితంగా మారిందని మరమ్మతులు చేయించాలని కోరారు. ఎమ్మెల్యే చొరవతో రహదారి మరమ్మతుల నిమిత్తం రూ.25 లక్షలు కేటాయించారు. కిలోమీటరు మేర రహదారి మెరుగుపరిచినా ఇంకా 3 కిలో మీటర్ల రహదారి గోతులతో అధ్వానంగా ఉంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన నిధులు ఇంకా మంజూరు కాలేదు. రహదారిపై ప్రయాణం మహిళలకు మరింత ఇబ్బందికరంగా మారింది. వాహనదారులు తరచు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారి నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.


ఆచంట - వేమవరం రోడ్డులో కోనపోతుగుంట వద్ద కమ్మేసిన మొక్కలు

రోడ్డును మూసేసిన పిచ్చి మొక్కలు

ఆచంట, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): రహదారి పక్కన పచ్చని చెట్లు ఉంటే ప్రయాణం ఆహ్లాదకరంగా సాగుతుంది. రోడ్డు మార్జిన్ మూసివేసినట్లు పిచ్చి మొక్కలు కమ్మేస్తే ప్రయాణం ప్రమాదకరం. కొన్ని రోజులగా వర్షాల జోరుతో రోడ్డు పక్కన ఉన్న పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. పంచాయతీ, సంబంధిత శాఖ పట్టించుకోకపోవడంతో పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగిపోయి మార్జిన్ లేకుండాపోయింది. చిన్నపాటి మలుపులో సైతం ఎదురు వాహనం కనిపించని పరిస్థితి. ఎదురురెదుగా రెండు వాహనాలు తప్పుకోలేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆచంట నుంచి వేమవరం వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డులో కోనపోతుగుంట సమీపంలో రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలతో వాహనదారులు ఇబ్బందులుపడుతున్నారు. రాత్రి వేళ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మండలంలో పలు ప్రధాన రహదారుల పక్కన కూడా ఇదే పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి ఉపాధి హామీ కూలీల ద్వారా పిచ్చిమొక్కలు తొలగించాలని పలువురు కోరుతున్నారు.



సంవత్సరాల తరబడి ఇబ్బంది పడుతున్నాం

పెంటపాడు - బోడపాడు రహదారి అస్సలు బాగోలేదు. సంవత్సరాల తరబడి ఈ రహదారిపై ప్రయాణాలు చేయలేక ఇబ్బందులు పడుతున్నాం. కనీసం మరమ్మతులు కూడా జరగడం లేదు. మొత్తం రహదారి అంతా గోతులుగా మారిపోయింది. చాలా మంది పడిపోతున్నారు. రహదారి నిర్మించి మా కష్టాలు తీర్చాలని కోరుతున్నాం.

- తుమ్మగంటి సాయిరాం, రైతు, బోడపాడు

రాత్రి వేళల్లో ప్రయాణం భయం.. భయం..

కిరాణా వ్యాపారం చేస్తూ ఉంటాను. సరుకుల కోసం రోజుకు రెండు, మూడుసార్లు తాడేపల్లిగూడెం వెళ్లాల్సి ఉంటుంది. రహదారి మొత్తం గోతులు పడి ప్రయాణం చాలా ఇబ్బందిగా ఉంటుంది. రాత్రివేళలో ప్రయాణం చేయడానికి భయపడుతున్నాం. మహిళల పరిస్థితి మరింత దయనీయం. రహదారి నిర్మిస్తే తప్ప మా కష్టాలు తీరవు.

- బాదం వీరరాఘవరావు, వ్యాపారి, బోడపాడు



అరచేతిలో సస్య రక్షణ

» సెల్‌ఫోన్‌లో ప్రత్యేక యాప్, క్యూర్ కోడ్
» తెగుళ్ల గుర్తింపు.. నివారణ సూచనలు
» మార్టేరు వరి పరిశోధన స్థానంలో వ్యవసాయాధికారులకు శిక్షణ





ప్రస్తుత సాంకేతిక యుగంలో సెల్‌ఫోన్ అత్యవసర పరికరంగా మారింది. ప్రపంచాన్ని అరచేతిలో పట్టి చూపుతుంది. అరక్షణంలో ఆర్థిక లావాదేవీలు చేయొచ్చు. కాలు కదపకుండా కావలసిన సరుకు కాళ్ల దగ్గరకు తెచ్చుకోవచ్చు. సెల్‌ఫోన్ ద్వారా చక్కబెట్టే పనులు చెప్పాలంటే సమయం సరిపోదు. సెల్‌ఫోన్ వ్యవసాయ సాగులో కూడా కీలకం కానుంది. ప్రత్యేక యాప్‌లు, క్యూర్ కోడ్ ద్వారా చేలకు ఆశించిన తెగుళ్లు గుర్తించవచ్చు.. నివారణ చర్యలు కూడా తెలుసుకోవచ్చు. దీనిని రైతుల వద్దకు చేర్చడానికి మార్టేరు వరి పరిశోధన స్థానంలో వ్యవసాయాధికారులు, రైతులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

పెనుమంట్ర, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆధునిక డిజిటల్ టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో సాగు పద్ధతులు కూడా మారనున్నాయి. పంటల్లో తెగుళ్ల, క్రిమి కీట కాలు గుర్తింపు, సస్య రక్షణ సెల్‌ఫోన్ ద్వారా చేపట్టవచ్చు. ఫోన్‌లో ప్రత్యేక యాప్ లేదా క్యూ ఆర్ కోడ్ ద్వారా రైతులకు సమాచారాన్ని అందించేందుకు కాబి ఇంటర్నేషనల్ సంస్థ 'ప్లాంట్ వైజ్ ప్లస్ యాప్' రూపొందించారు. కాబి ఇంటర్నేషనల్ సంస్థ రూపొందించిన ఈ వివరాలపై మార్టేరు వరి పరిశోధన స్థానంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, రైతులకు రెండు రోజులపాటు శిక్షణ ఇచ్చారు. కాబి ప్లాంట్ వైస్ ప్లస్ క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే సుస్థిర వ్యవసాయ పంట ఉత్పత్తులు ప్రత్యక్షమవుతాయి. పంటలకు వచ్చే తెగుళ్లను సకాలంలో గుర్తించి నివారణ చర్యలు చేపట్టవచ్చు. వ్యవసాయ సాగులో నష్టాల నివారణకు పలు దేశాల్లో కాబి ప్లాంట్ వైస్ ప్లస్ యాప్ సహాయపడుతోంది.

చిన్న సన్న కారు రైతులకు ఎక్కువ ఉత్పత్తి, నాణ్యత మెరుగుపరచడంలో తోడ్పడుతుంది. రైతుకు సరైన సలహాలు ఇవ్వడం, తగు నిర్ణయాలు తీసుకోవడంలో కాబి ప్లాంట్ వైస్ ప్లస్ టూల్కిట్ డిజిటల్ సాధన ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇవి పంటల ఆరోగ్యం, సంరక్షణ గురించి తెలిపే వెబ్‌సైట్ మొబైల్ యాప్, ఆన్‌లైన్‌లో శిక్షణ కోర్సు లను సులభంగా ఉండేందుకు సహాయపడుతుంది.

కాబి జీవ భద్రతా పోర్టల్

బయో ప్రొటెక్షన్ పోర్టల్ ఓపెన్ ఆక్సిస్ సాధన ప్రపంచవ్యాప్తంగా నమోదు చేయబడిన జీవ నియంత్రణ, జీవకీటక నాశిని సమాచారం అందిస్తుంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో లభిస్తుంది. ఈ యాప్ వ్యవసాయ సలహాదారులకు, రైతులకు తన పంటలో కలిగే సమస్యాత్మక తెగుళ్లను, నియంత్రించడానికి కావలసిన జీవ నియంత్రణ, జీవ తెగుళ్ల నాశినులను గుర్తించి కొనుగోలు చేయడానికి, సక్రమంగా వాడటానికి సహాయపడుతుంది.

నాలెడ్జ్ బ్యాంక్

నాలెడ్జ్ బ్యాంకులో15 వేలకు పైగా వివిధ పంటలు తెగుళ్ల నిర్వహణను తెలిపే వాస్తవ పత్రాలు ఫ్లాడ్ షీట్స్ గైడ్స్ వీడియోలు, పురుగు తెగుళ్ల గుర్తించే సాధనాలు, పలు దేశాలకు సంబంధించి కీటక, తెగుళ్ల నాశిని జాబితా, వ్యాధి నిర్ధారణ పద్ధతులు ఉన్నాయి.

కాబి అకాడమీ శిక్షణ తరగతులు ధ్రువీకరణ పత్రాలు రైతుల సలహాల నైపుణ్యాలు, పెంచడంలో తోడ్పడతాయి. రైతులకు సరైన సలహాలను ఇవ్వడం ద్వారా పంటల దిగుబడి పెంచడంలో వీరు ఎంతో తోడ్పడుతారు. అనువైన ఇంటరాక్టర్ కోర్సుల యాప్‌ల ద్వారా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా లభిస్తాయి.



పిచికారీ యాప్

క్రాప్ స్ప్రేయర్ వినియోగించడానికి సులభమైన, ఉచిత ఆండ్రాయిడ్ యాప్ పంటలపై మందు పిచికారీ, ఎంత కీటక నాశినిని వినియోగించాలో లెక్కించడంలో సహాయపడుతుంది. యాప్‌లో వివిధ సూత్రీకరణలు, కీటక నాశిలను సరైన మోతాదులో వాడటంలో సహాయపడుతుంది. డబ్బు ఆదా చేయడం, అధిక మోతాదులో వాడడం వల్ల కలిగే హానిని అరికట్టడంలో సహాయపడుతుందని కాబి ఇంటర్నేషనల్ నిర్వాహకులు శాస్త్రవేత్తలకు వ్యవసాయ అధికారులకు రైతులకు తెలియపరిచారు. ఇది క్షేత్ర స్థాయిలో ఎరువులు, పురుగుమందులు వినియోగం తగ్గి రైతుకు పెట్టుబడి తగ్గి దిగుబడి పెరుగుతుందని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

పురుగుల మందుతో జాగ్రత్త

అత్తిలి/లింగపాలెం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): వ్యవసాయం అంటేనే కష్టనష్టాలతో కూడుకున్న పని. ప్రకృతిలో మార్పులు చోటుచేసుకుంటే ఆరుగాలం పండించిన పంట చేతికొస్తుందో రాదోననే భయం అన్నదాతలను వేధిస్తుంది. ఉమ్మడి జిల్లాలో లక్షల ఎకరాలలో వరి, మొక్కజొన్న, పత్తి, మినుము, పెసర, పలురకాల ఉద్యాన, వాణిజ్య పంటలు సాగుచేస్తున్నారు. తెగుళ్ల నుంచి పంట రక్షించుకునే క్రమంలో పురుగు మందుల పిచికారీ సమయంలో రైతులు అనారోగ్యాల పాలవుతున్నారు. పురుగు మందులు అసలు, నకిలీ తెలుసుకునేందుకు మూత తీసి వాసన చూస్తుంటారు. పురుగు మందుల ఘాటుకు కడుపులో వికారం, వళ్లంతా దద్దుర్లు రావడం, ఊపిరితిత్తులు, కళ్లు, గొంతు సమస్యలు తలెత్తుతాయి. శరీర అవయవాల పని తీరు మందగించడం, కంటిచూపు తగ్గడం, ఊపిరి తిత్తులు పాడవడం వంటి అనారోగ్యకారణాలు చోటుచేసుకుంటాయని వైద్య నిపుణులు, వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

వీటిని పాటించాలి

- పిచికారి చేసే సమయంలో రైతులు ముక్కు, నోటికి మాస్క్, చేతులకు గ్లౌజులు ధరించాలి.
- తలకు రక్షణగా టోపీ పెట్టుకోవాలి.
- శరీరం మొత్తం కప్పిఉంచే ఆప్రాన్ ధరించాలి.
- ఉదయం, సాయంత్రం వేళల్లో గాలివాలుగానే పిచికారి చేయాలి.
- అనారోగ్య సమస్యలు వస్తే వైద్య సేవలు పొందాలి.
- పురుగు మందు నేరుగా ట్యాంకులో కలపకూడదు. విడివిడిగా వేరే ప్రాంతాల్లో కలుపుకొని మిశ్రమాన్ని ట్యాంకులో పోసుకోవాలి.
- పురుగు మందు, తెగుళ్ల మందు రెండింటిని కలిపి పిచికారి చేయవద్దు, విడివిడిగా కలుపుకోవాలి.
- కలుపు నాశని మందును పిచికారి చేశాక ట్యాంకు శుభ్రంగా కడగాలి.
- పురుగు మందు విరిగిపోతే దాన్ని పిచికారి చేయకూడదు.
- పిచికారి సమయంలో ధూమపానం, మద్యపానం చేయకూడదు. పాన్‌పరాగ్, గుట్కాలు నమలకూడదు. వీటి ద్వారా పురుగు మందు అవశేషాలు నోటి ద్వారా ఊపిరితిత్తులకు చేరతాయి.

సేంద్రియ సాగు పద్ధతులు ఆచరించాలి



పురుగుమందులలో అధిక గాఢత వలన చర్మ సంబంధిత సమస్యలు, ఊపిరితిత్తుల వ్యాధులు వస్తున్నాయి. మెదడుపై కూడా ప్రభావం చూపుతాయి. పురుగుమందుల పిచికారీ తర్వాత కళ్లు తిరగడం, వాంతులు, విరోచనాలు, కళ్లమంట వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ విధానంతో క్రిమిసంహారక పురుగుమందులు లేకుండానే తెగుళ్లను నివారించవచ్చు.

- వి.ప్రదీప్‌కుమార్, ఏవో, లింగపాలెం

కుంకుళ్లమ్మకు శరన్నవరాత్రి శోభ

» 22 నుంచి ఉత్సవాలు » ముస్తాబవుతున్న అమ్మవారి ఆలయం



ద్వారకాతిరుమల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామి క్షేత్రదేవత కుంకుళ్లమ్మ ఆలయంలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఈనెల 22 నుంచి ప్రారంభం కానున్నాయి. వచ్చేనెల 2 వరకూ జరగనున్న ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు, ఇప్పటికే ఆలయ పరిసరాలను రంగులు, విద్యుత్ దీప తోరణాలతో అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు రోజుకో ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని ఆలయ ఈవో ఎన్వీఎస్ఎన్ మూర్తి తెలిపారు.

అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు

అమ్మవారు ఈనెల 22న బాలాత్రిపురసుందరి, 23న గాయత్రిదేవి, 24న అన్నపూర్ణా, 25న కాత్యాయినీ, 26న మహాలక్ష్మీ, 27న లలితా త్రిపురసుందరి, 28న మహాచండిగా దర్శనమిస్తారు. 29న మూలానక్షత్రాన్ని పురస్కరించుకుని మహాసరస్వతి, 30న దుర్గాదేవిగా అనుగ్రహించనున్నారు. వచ్చేనెల 1న మహిషాసురమర్దని, 2న రాజరాజేశ్వరీదేవిగా దర్శనమిస్తారన్నారు. అదేరోజున సాయంత్రం శ్రీవారి క్షేత్రంలో అమ్మవారి రథోత్సవం, 3న ఉదయం 7గంటలకు ఇరుముడుల సమర్పణ, చండీహోమాన్ని నిర్వహిస్తారు. 4న ఆలయం వద్ద ఉదయం 11 గంటలకు భారీ అన్నసమారాధన జరుగుతుందని భక్తులు తరలిరావాలని ఈవో కోరారు.

ద్వారకాతిరుమలలో శ్రీకృష్ణాష్టమి వేడుక


సప్తగోకులంలో శ్రీకృష్ణుడికి హారతులు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు చినవెంకన్న క్షేత్రంలో సోమవారం నేత్రపర్వంగా జరిగాయి. ఉదయం గోసంరక్షణశాలలో పలువురు గోవులకు పూజలు చేశారు. సప్తగోకులంలో శ్రీకృష్ణుని పలువురు దర్శించుకున్నారు. ఆలయంలో కృష్ణుని విగ్రహానికి అర్చకులు, పంచామృత అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం 12 రకాల సేవా కాలాలను నిర్వహించి దాంతో పాటు 12 రకాల పిండి వంటలను నైవేద్యంగా చిన్నికృష్ణునికి సమర్పించారు. ఆలయంలో సోమవారం అన్ని రకాల ఆర్జిత సేవలు రద్దు అయ్యాయి. మంగళవారం యధావిధిగా ప్రారంభమవుతాయని ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి తెలిపారు.

నేడు ఉట్టి పండుగ

శ్రీకృష్ణ జన్మాష్టమి మరుసటి రోజైన మంగళవారం సాయంత్రం క్షేత్రంలో ఉట్టి పండుగ జరుగుతుందని ఆలయ ఈవో మూర్తి తెలిపారు. ఉభయదేవేరులతో శ్రీవారు తిరువీధుల్లో ఊరేగుతారని భక్తులు ఈ వేడుకలో పాల్గొనాలని ఆయన కోరారు.

డంపింగ్ యార్డు వద్దంటూ ధర్నా


ధర్నా చేస్తున్న డంపింగ్ యార్డు బాధితులు

నరసాపురం టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నివాసాల మధ్య డంపింగ్ యార్డు ఏర్పాటు చేయవద్దంటూ సోమవారం పట్టణంలోని 28వ వార్డు ప్రజలు ధర్నాకు దిగారు. ముందుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేసి ఆర్డీవో దాసిరాజుకు వినతిపత్రం ఇచ్చారు. అక్కడ నుంచి మునిసిపల్ కార్యాలయం వరకు ప్రదర్శన చేసి, కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తున్న స్థల సమీపంలో దళితులు అత్యధిక సంఖ్యలో నివాసిస్తున్నారని కమిషనర్ అంజయ్యకు విన్నవించారు. ఇక్కడ కాకుండా మరో స్థలంలో చూడాలని కోరారు. కమిషనర్ మాట్లాడుతూ కలెక్టర్‌తో చర్చించిన తరువాతే తగు నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పంటు తనిఖీ


పంటును పరిశీలిస్తున్న ఎంపీడీవో వీరభద్రరావు

నరసాపురం రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మాధవాయిపాలెం రేవును సోమవారం ఎంపీడీవో వీరభద్రరావు తనిఖీ చేశారు. పంటు నిర్వహణ, ఫిట్‌నెస్ పత్రాలు, డ్రైవర్ లైసెన్స్, లైఫ్ జాకెట్ల సంఖ్య, టిక్కెట్ల విక్రయ పుస్తకాలను పరిశీలించారు. ఇటీవల నది ప్రవాహానికి పంటు ఓ పక్కకు ఒరిగినట్లు సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోపై ఆరా తీశారు. ఇటువంటి సంఘటనలు మరోసారి పునరావృతం కాకూడదన్నారు. నిర్దేశించిన సంఖ్యలోనే ప్రయాణికుల్ని, వాహనాలను ఎక్కించాలన్నారు. ఇక నుంచి తరుచూ తనిఖీ చేస్తామని అన్నారు.

ఎల్ఆర్ఎస్‌లో కొన్ని మార్పులు చేయాలి

భీమవరం టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అనధికారిక లే-అవుట్‌లను రెగ్యులర్ చేసుకునేందుకు యజమానులకు ఉపయోగ పడే విధంగా జీవో ఇచ్చినా అందులో కొన్నిమార్పులు చేస్తే మరింత ప్రయోజన కరంగా ఉంటుందని వెల్ఫేర్ ఆఫ్ లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్ (ఎల్‌టీపీ) అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సత్తి రాంబాబు తెలిపారు. సోమవారం భీమవరంలో జరిగిన జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇందులో ప్లాట్ దారుడు రెగ్యులర్ కోసం దరఖాస్తు చేసుకుంటే ఆరోజు ఉండే ధర ఆధారంగా 14శాతం విధించటం వల్ల ఎంతో ఇబ్బందితో పాటు ఆర్థికంగా కూడా భారంగా మారుతుందని అన్నారు. దానిని గతంలో స్థల రిజిస్ట్రేషన్ చేసుకున్న రోజున ఉన్న ధర ఆధారంగా 10 శాతం కట్టేవిధంగా మార్పుచేస్తే ప్రయోజన కరంగా ఉంటుందని ఆయన అన్నారు. అపార్ట్ మెంట్ నిర్మాణ విషయంలో అదనంగా మరో రెండు ఫ్లోర్లకు అనుమతి ఇవ్వటం వల్ల ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు.

వెల్ఫేర్ ఆఫ్ ఎల్‌టీపీ జిల్లా కార్యవర్గం ఎన్నిక

భీమవరం టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వెల్ఫేర్ ఆఫ్ ఎల్‌టీపీ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక సోమవారం నిర్వహించారు. జిల్లా గౌరవాధ్యక్షునిగా బీహెచ్ జానకీ రామరాజు (భీమవరం), అధ్యక్షునిగా వి. శ్రీనివాసరావు(తణుకు), కార్యదర్శిగా కేవీ రమణ (భీమవరం) ఉపాధ్యక్షులుగా పెచ్చెటి శ్రీనివాసరావు (నరసాపురం), కె.సూర్యచంద్రరావు(తణుకు), జాయింట్ సెక్రటరీగా ఎల్.వెంకట్ (భీమవరం),కోశాధికారిగా వివిఎస్ఎస్‌కె మణికంఠ కుమార్(పాలకొల్లు), సభ్యులుగా ఎస్ఎల్ గణేష్(పేరుపాలెం), జి ఉమామహేష్(తణుకు), పి.సురేష్(నరసాపురం), టి ఉమామహేశ్వరరావు(భీమవరం), బండెల హనుమంతులు(తాడేపల్లిగూడెం) ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. ఈ సందర్భంగా సీనియర్ ఎల్‌టీపీ, ఇంజనీర్ ఎంవీ నరసింహారావును సత్కరించారు.

సార్వాలోను తప్పని సాగునీటి సమస్య

ఆచంట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సార్వా సాగు అంటేనే తరచూ వర్షాలు పడటం వల్ల సాగునీటికి ఇబ్బందులు తలెత్తవు. అయితే కొన్ని చోట్ల సాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. ఆచంట, కొడమంచిలి రోడ్డు మధ్యలో కొడమంచిలిలోని తాడేరు కాలువ సమీపంలో బోరు ద్వారా ఇంజన్ సహాయంతో పొలాలకు నీరు పెట్టుకునే పరిస్థితి నెలకొంది. తాడేరుకాలువ పక్కన ఆనుకుని ఉన్న పంట పొలాలకు సంబంధించి పంట బోదెల్లో నీరు లేకపోవడంతో సాగునీటి సమస్య ఏర్పడిందని రైతులు వాపోతున్నారు.

అనధికార లేఅవుట్‌ల క్రమబద్ధీకరణకు అవకాశం

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి):అనధికార లేఅవుట్‌లు క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఏలూరు అర్బన్‌డెవలప్‌మెంట్ ప్లానింగ్ అధికారి వి.సుధాకర్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం అక్రమ లేఅవుట్ రెగ్యులైజేషన్ స్కీంపై తాడేపల్లిగూడెం, తణుకు, పెంటపాడు, ఇరగవరం, అత్తిలి, గణపవరం మండల కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వి.సుధాకర్ మాట్లాడుతూ ఈ స్కీమ్ క్రమబద్ధీకరించుకోవడం వల్ల బ్యాంకులో రుణంతోపాటు ఆ స్థలం చట్టబద్ధమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.వెంకటేష్, డిప్యూటీ ఎంపీడీవోలు ఎం.శ్రీనివాసరావు, వైవీఆర్‌వీ ప్రసాద్, వీవీవీఎస్ రాంప్రసాద్, టీవీఎస్ఎస్ మూర్తి, టీవి సత్యనారాయణ పాల్గొన్నారు.

20న బీచ్ పరిశుభ్రతా కార్యక్రమం


పేరుపాలెం తీరాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో దాసిరాజు, అధికారులు

మొగల్తూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ సముద్ర తీర ప్రాంతాల పరిశుభ్రతా కార్యక్రమా న్ని ఈనెల 20న నిర్వహించే ందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు నరసాపురం ఆర్డీవో దాసిరాజు తెలిపారు. సోమవారం జిల్లా టూరిజం, రవాణా శాఖా ధికారులతో పాటు మండలస్థాయి అధికారులతో పేరుపాలెం, కెపిపాలెం సాగరతీరాలను పరిశీలించారు. ఈనెల 20న సముద్రం వెంబడి అన్ని శాఖల అధికారులు, నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది, విద్యా ర్థులు పాల్గొని తీర ప్రాంతాన్ని పరిశుభ్రం చేసేందుకు అవసరమయ్యే ఏర్పా ట్లుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రాజ్ కిషోర్, ఎంపీడీవో త్రిశూలపాణి, డీఎల్పీవో, ఈవోఆర్డీ నవీన్ కిరణ్ పాల్గొన్నారు.

రాహుల్‌దేవ్ శర్మకు ఎక్సైజ్ డైరెక్టర్ బాధ్యతలు

అమరావతి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ బాధ్యతలను ఆ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మకు అప్పగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఎక్సైజ్ శాఖ డైరెక్టర్‌గా పనిచేసిన నిషాంత్ కుమార్ ఇటీవల అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయిన నేపథ్యంలో ఈ మేరకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

నల్లబ్యాడ్జీలతో విద్యుత్ ఉద్యోగుల నిరసన

అమరావతి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్తు సంస్థల్లో ఉన్న 23 సంఘాల ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారానికి సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. 22వ తేదీ వరకు వివిధ రూపాల్లో నిరసన తెలిపి, అప్పటికీ యాజమాన్యాలు స్పందించకుంటే 24న జేఏసీ సమావేశమై తదుపరి కార్యాచరణ ప్రకటిస్తుందని ఏపీఎస్‌పీఈజేఏసీ ప్రకటించింది.

ఎన్నాళ్లో వేచిన ఉదయం

ఉమ్మడి పశ్చిమలో 1063 ఉపాధ్యాయ ఉద్యోగాలకు అభ్యర్థుల ఖరారు

- 534 మంది పురుషులు, 529 మంది మహిళలు.. అర్హులు లేని కారణంగా భర్తీ కాని 11 పోస్టులు
- దసరా సెలవుల్లో శిక్షణ, పోస్టింగ్‌లకు కౌన్సెలింగ్
- 19న వెలగపూడిలో సీఎం సమక్షంలో నియామక పత్రాలు


పెదవేగి మండలం కూచింపూడిలో ఫిజికల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికైన భార్యకు మిఠాయి తినిపిస్తున్న భర్త చంద్రశేఖర్

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి):మెగా డీఎస్సీ-2025 ఉపాధ్యాయ ఉద్యోగాలకు తుదిగా ఎంపికైన అభ్యర్థుల జాబితాను విద్యా శాఖ సోమవారం విడుదల చేసింది. ఉమ్మడి పశ్చిమ గోదావరిలో ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్, గిరిజన సంక్షేమ శాఖ, జువనైల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ల పాఠశాలలకు 1074 పోస్టులను నోటిపై చేయగా, వీటిలో 1063 పోస్టులకు అర్హులైన అభ్యర్థులను మెరిట్ కం రిజర్వేషన్ రోస్టర్ నిబంధనల మేరకు ఖరారు చేస్తూ వారి పేర్లను వెలువరించారు. ఆయా కేటగిరీల(స్కూల్ అసిస్టెంట్/ఎస్జీటీ) నుంచి 11 పోస్టులకు అర్హులైన అభ్యర్థులు లేకపోవడంతో వాటిని భర్తీ చేయలేదు. వీటిని వచ్చే డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌కు ఉంచేశారు. ఇందులో ఎస్సీ ఉపకులాలకు రిజర్వ్ చేసిన 10 పోస్టులు, బీసీ(మహిళ) కేటగిరీలో ఒక పోస్టు ఉన్నాయి. ఎంపికైన 1063 మంది అభ్యర్థుల్లో 534 మంది పురుషులు, 529 మంది మహిళలున్నారు. వీరందరికీ దసరా సెలవుల్లో ఈ నెల 22 నుంచి 29 వరకు ఇండక్షన్ ట్రైనింగ్ ఇవ్వనున్నారు. శిక్షణ సమయంలోనే కౌన్సెలింగ్ ద్వారా ప్లేస్‌మెంట్ ఆర్డర్లు జారీచేస్తారు.

15 రోజుల్లో చేరకుంటే..

ఉమ్మడి పశ్చిమలో మండలాల వారీగా టీచర్ల కొరతవున్న పాఠశాలలను గుర్తించి, వెకెన్సీలను కౌన్సెలింగ్‌లో ప్రదర్శిస్తారు. ఆ మేరకు కేటగిరీ-4తో ప్రారంభించి కేటగిరీ-1 వరకు నోటిఫైడ్ పోస్టులకు సమానంగా ప్రదర్శనకు పెట్టిన వెకెన్సీలకే అభ్యర్థులు ఆప్షన్ ఇవ్వాలి. శిక్షణ పూర్తయిన వెంటనే అభ్యర్థి తమకు కేటాయించిన పాఠశాలల్లో 15 రోజుల్లోగా చేరాలి. లేకుంటే ఆ పోస్టును తదుపరి డీఎస్సీకి చూపుతారు. వెయిటింగ్ లిస్టు ఉండదు. అప్రంటీస్ షిప్ ఉండదు. రెగ్యులర్ జీతభత్యాలు చెల్లిస్తారు. ప్రస్తుత విద్యాసంవత్సరం అకడమిక్ కేలండర్ ప్రకారం మిగిలి వున్న సీఎల్స్/స్పెషల్ సీఎల్స్ నూతన ఉపాధ్యాయులకు వర్తిస్తాయి. ఎంపికైన అభ్యర్థులకు కుటుంబసభ్యులు మిఠాయిలు తినిపించి సంతోషాన్ని పంచుకున్నారు. కొందరైతే ఇష్టదైవాలకు పూజించారు. ఎన్నాళ్లకో తమ కల ఫలించిందని ఆనందం వ్యక్తం చేశారు.

ఏలూరులో వసతి.. పెద్ద సమస్యే!

ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 19న వెలగపూడిలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా నియామక పత్రాలు అందించేందుకు జిల్లా విద్యా శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు ఎంపికైన అభ్యర్థితోపాటు ఒక సహాయకుడిని తీసుకువెళ్లవచ్చు. ఈ లెక్కన 2,126 మందికి ఏలూరులోని తొమ్మిది పాఠశాలల్లో వసతి కల్పించేలా నిర్ణయించారు. వీరంతా తమకు కేటాయించిన పాఠశాలకు ఈ నెల 18 సాయంత్రం నాలుగు గంటలకు చేరుకోవాలి. స్కూలు తరగతి గదులనే నిద్రించడానికి వీలుగా మలుస్తున్నారు. ఆ రోజు రాత్రి భోజనం, మరుసటి రోజు ఉదయం అల్పాహారం అనంతరం ఆర్టీసీ బస్సుల్లో వెలగపూడికి తరలిస్తారు. మార్గ మధ్యలో భోజనం చేయడానికి వీలుగా ఆహార ప్యాకెట్లను సిద్ధం చేసి బస్సులో ఉంచుతారు. ఆ మేరకు ప్రతీ 24 మంది ఉపాధ్యాయ అభ్యర్థులు, వారి వెంట వచ్చిన మరో 24 మంది సహాయకులను ఒక బస్సులో తరలించేలా నిర్ణయించి, వారికి భోజన, వసతి సౌకర్యాలు, రవాణా, తదితర విషయాలను సమకూర్చడం, పర్యవేక్షించడానికి అధికారుల నేతృత్వంలో మొత్తం 45 టీమ్‌లను నియమించారు. ప్రతీ బృందంలో ఒక ఎంఈవో పర్యవేక్షకునిగా, మరో నలుగురు వ్యాయామ విద్య ఉపాధ్యాయులు సూపర్‌వైజర్లుగా వ్యవహరిస్తారు. ఇంత వరకు ఏర్పాట్లు బాగానేవున్నా అభ్యర్థులు, వారి సహాయకులు 18న రాత్రి నిద్రించడానికి వీలుగా మంచాలు/పరుపులు/బ్లాంకెట్స్ సరి పడా సంఖ్యలో లేవు. ఏలూరు, సమీప ప్రాంతాల్లోని షామియానా సెంటర్లలో ఎంత గాలించినా 500 పరుపులు కూడా అందుబాటులో లేవు. మరోవైపు భోజనం, అల్పాహారం, తాగునీరు, తదితర ఖర్చులకు ప్రభుత్వం నుంచి సోమవారం సాయంత్రం వరకు బడ్జెట్ విడుదలపై సమాచారం అందకపోవడంతో ఖర్చులపై డైలమా నెలకొంది. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల్లో గర్భిణీలు, చిన్నపిల్లలున్న తల్లులు, దివ్యాంగులుంటే వసతి ఎలాగనే సందేహాలు వ్యక్తమవుతు న్నాయి. అభ్యర్థితోపాటు వందల సంఖ్యలో అభ్యర్థులు, వారి సహాయకులకు టాయిలెట్ల సమస్య ఏర్పడనుంది. రవాణా నిమిత్తం ఆర్టీసీ బస్సులను ప్రభుత్వం సమకూర్చింది. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలని విద్యా శాఖ వర్గాలు కోరుతున్నాయి.

విర్డ్‌లో ఆర్థో శస్త్ర చికిత్సలు విజయవంతం


ద్వారకాతిరుమల విర్డ్‌లో శస్త్ర చికిత్సలు లైవ్‌లో చూస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి):విర్డ్ ఆసుపత్రిలో ఈ నెల 13, 14 తేదీల్లో 14 మందికి తుంటి, మోకాలుకు ఆర్థో శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించారు. జాతీయస్థాయి ప్రముఖులైన 14 మంది ఫ్యాకల్టీలు, 150 మంది వైద్యులు పాల్గొన్నారు. మోకాలు, తుంటికి సంబంధించి ఇన్‌ఫెక్టెడ్, రివిజన్ శస్త్ర చికిత్సలను డాక్టర్ కృష్ణకిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆసుపత్రి చైర్మన్ రాజా ఎస్‌వీ సుధాకరరావు మాట్లాడుతూ ఇటువంటి శస్త్ర చికిత్సలు వైద్యులు తమ విజ్ఞానాన్ని పెంచుకునేందుకు, నైపుణ్యతను మెరుగు పర్చుకునేందుకు ఉపయోగపడతాయన్నారు. జాతీయ వైద్యులు రాజేష్ మల్హోత్రా, మహేష్ కులకర్ణి, నరేంద్ర, రాజ్‌కుమార్, నటేశన్, సాయిలక్ష్మణ్ అన్నే, అనిల్ ఉమ్మేన్, బిపిన్ తెరువల్, సమీర్ ఆలీ పర్వత, చంద్రశేఖర్, సునీల్ అప్పింగి, సుమన్ పెండ్యాల, వినయ్ కిశోర్, ఆదిత్యకృష్ణ, రాంప్రసాద్ కంచెర్ల, రాజేష్‌కుమార్‌రెడ్డి, సుమిత్ భూషణ్‌శర్మ, పాల్గొన్నారు. ట్రస్టీలు, ఈవో మూర్తితోపాటు వైద్యులు భవ్యచంద్, హమీద్, బాలాజీ, విహారీ, పివి నాగేంద్రబాబు, సింధు, రమ్య, మహిత తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన వర్సిటీ వీసీ ఎవరో ?

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి):డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయ ఉపకులపతి నియామకం పై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఇప్పటి వరకూ ఇన్‌చార్జ్ వీసీగా కొనసాగిన గోపాల్ ఆగస్టు నెలాఖరున ఉద్యోగ విరమణ చేయగా అప్పటి నుంచి ఆయన స్థానంలో ఎవర న్నది సందిగ్ధంలోనే ఉంది. ప్రస్తుత వీసీ గోపాల్‌ను వీసీగా కొనసాగి స్తారా ? విశ్వ విద్యాలయ పరిధిలో సీనియర్లకు అదనపు బాధ్యతగా ఇన్‌చార్జ్ వీసీగా నియమిస్తారా ? అనేది తేలాలి. ప్రస్తుతం వీసీ రేసులో సీనియారిటీ జాబితా ప్రకారం మహానంది హెచ్ఆర్ఎస్‌లో ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం, వెంకట్రామన్నగూడెం పరీక్షల నియంత్రణ అధికారి బి.ప్రసన్నకుమార్, విస్తరణా సంచాలకు లు డాక్టర్ బి.గోవిందరాజు ముందున్నారు.ఇన్‌చార్జ్ వీసీ గోపాల్ తన ను కొనసాగించాలని ప్రభుత్వానికి రాసిన లేఖపై స్పష్టత రాలేదు.

13 మంది ఏఓలకు ఎంపీడీవోలుగా పదోన్నతి


ఎంపీడీవోగా నియామక పత్రాలు అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

ఏలూరు సిటీ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ పరిధిలో పనిచేస్తున్న 13 మంది ఏఓలకు ఎంపీడీవోలుగా పదోన్నతులు కల్పించారు. ఈ ఉత్తర్వులను జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన వెంటనే కారుణ్య నియామకాల తొలి ఫైల్‌పై సంతకం చేశానన్నారు. జడ్పీలో ఇప్పటి వరకు 87 మందికి పదోన్నతులు కల్పించామని, ఇందులో ఏఓలుగా 27 మందికి, సీనియర్ అసిస్టెంట్లుగా 31 మందికి, జూనియర్ అసిస్టెంట్లుగా ఆరుగురికి, రికార్డ్/లైబ్రరీ/ల్యాబ్ అసిస్టెంట్లుగా 23 మంది ఉన్నారన్నారు. జడ్పీ సీఈవో ఎం.శ్రీహరి మాట్లాడుతూ పదోన్నతులు ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని పెంచటమే కాక పనితీరును మెరుగుపరచుకోవటానికి అవకాశం ఏర్పడుతుందన్నారు.


ఎంపికైన మహిళా కబడ్డీ జట్టు

కబడ్డీ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి):పశ్చిమ గోదావరి జిల్లా మహిళా, పురుషుల కబడ్డీ జట్లు తాడేపల్లిగూడెం వాసవి ఇంజనీరింగ్ కళాశాల వద్ద సోమవారం ఎంపికయ్యాయి. వ్యాయామ ఉపాధ్యాయులు రామకృష్ణ ఆధ్వర్యంలో 14 మంది పురుషులు, 14 మంది మహిళలను ఎంపిక చేశారు. వ్యాయామ క్రీడాకారులు కె.ప్రసన్నకుమార్, కల్లపల్లి శ్రీను, జి.శ్రీకాంత్ ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 24 నుంచి 28 మధ్యలో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పశ్చిమగోదావరి జిల్లా తరపున పాల్గొంటారు.

పేద కమ్మ కుటుంబాలకు అండగా ఉంటాం

అమరావతి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి):కమ్మ కులంలో వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలవడమే కార్పొరేషన్ లక్ష్యమని కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి పేర్కొన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన నేతృత్వంలో డైరెక్టర్లు తొలి సారిగా సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ కమ్మ కులంలో ఆర్థిక ఇబ్బందులు వల్ల ఒక్క విద్యార్థి కూడా చదువు ఆపకుండా చూడాల్సిన బాధ్యత కార్పొరేషన్‌పై ఉందన్నారు.

దేవస్థానం రికార్డు అసిస్టెంట్ సస్పెన్షన్

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దేవస్థానంలో లీజెస్ విభాగంలో పనిచేస్తూ చేతివాటం ప్రదర్శించిన రికార్డు అసిస్టెంట్ సాయిని సస్పెండ్ చేస్తూ ఆలయ ఈవో ఎన్వీ సత్యన్నారాయణమూర్తి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. దేవస్థానం షాపుల పాటదారుడు నుంచి వసూలు చేసిన లీజు సొమ్ములో కొంత స్వాహా చేసి మిగిలిన సొమ్మును దేవస్థానానికి జమ చేసిన వ్యవహారంలో ఈవో విచారణ చేపట్టారు. అనంతరం సస్పెన్షన్ నిర్ణయం తీసుకున్నారు. గతనెలలో దేవస్థానం నిర్వహించిన వేలంపాటలో పాటదారుడు చెల్లించిన సొమ్ములో రూ.9 వేలు తగ్గించి ఎంఆర్ రాయడంతో ఈ భాగోతం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. టీడీపీ కాంప్లెక్స్ షాప్‌నెంబరు 11కు సంబంధించి జరిగిన వేలంపాటలో సదరు రికార్డు అసిస్టెంట్ అనుమంచిపల్లి సాయిరామానుజన్ చేతివాటం ప్రదర్శించినట్లు అధికారులు ధ్రువీకరించారు. హెచ్చు పాటదారుడు సిద్ధయ్య ఆగస్టు 6న షాపు అద్దె సొమ్ము రూ.51 వేలను పాటదారుడు రికార్డు అసిస్టెంట్‌కు కట్టాడు. ఆ ఉద్యోగి తనకు అందిన సొమ్ము మొత్తానికి ఎంఆర్ రాయకుండా రూ.9 వేలు తగ్గించి రూ.42వేలకు మాత్రమే ఎంఆర్ రాశాడు. ఇది నిజమని తేలడంతో సస్పెండ్ చేశారు.

బాలుడి ఆచూకీ కోసం రెండో రోజు గాలింపు

పాలకోడేరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): వేంద్ర అగ్రహారం శివారు కట్టావారిపాలెంలో ఆదివారం సాయంత్రం గోస్తనీ నదిలో పడి గల్లంతైన బాలుడి ఆచూకీ కోసం రెండవ రోజు సోమవారం కూడా గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం సాయంత్రం వరకు పాలకోడేరు మండల పోలీసులు, భీమవరం ఫైర్ సిబ్బందితో పాటు స్థానికులు రొయ్యల చెరువుల్లోని నాటుబోట్లను వేసుకుని గాలింపు చర్యలు చేపట్టారు. చీకటి పడే వరకు గల్లంతైన బొక్కా జైదేవ్(7) ఆచూకీ లభ్యం కాకపోవడంతో అధికారులు ఎన్‌డీఆర్ఎఫ్ (జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ)కు చెందిన బృందం సభ్యులు కాకినాడ నుంచి రప్పించారు. చీకటిపడ్డాక ఎన్‌డీఆర్ఎఫ్ సభ్యులు బాలుడి ఆచూకీ కోసం వెతుకులాట ప్రారంభించారు. బాలుడు గల్లంతైన ప్రదేశాన్ని తహసీల్దార్ భారతీ విజయలక్ష్మి, ఎస్ఐ రవివర్మ, పోలీసులు పరిశీలించారు.

వ్యభిచార గృహం నిర్వాహకుడి అరెస్టు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తూ పరారీలో ఉన్న ప్రధాన నిందితుడిని ఏలూరు రూరల్ పోలీసులు సోమవారం రాత్రి అరెస్టు చేశారు. ఏలూరు రాఘవాచారి వీధిలో నివాసముంటున్న కలవకుంట్ల అశోక్‌కుమార్ ఏలూరు రూరల్ మండలం తంగెళ్లమూడి ప్రాంతం బీడీ కాలనీలో ఒక ఇంటిని అద్దెకు తీసుకుని ఇతర ప్రాంతాల నుంచి యువతులను తీసుకొచ్చి వ్యభిచారం నిర్వహిస్తున్నాడు. ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ పర్యవేక్షణలో నిఘా పెట్టి ఆ ఇంటిపై గతంలో దాడి చేశారు. అప్పట్లో ప్రధాన నిందితుడైన కలవకుంట్ల అశోక్ కుమార్ పరారీ అయ్యాడు. మిగిలిన వారిని పోలీసులు అరెస్టు చేశారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న అశోక్ కుమార్‌ను సోమవారం రాత్రి రాఘవాచారివీధిలో పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం కోర్టులో హాజరుపర్చనున్నారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

ఉండి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మహదేవపట్నంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడుల్లో రూ.3800 నగదు స్వాధీనం చేసుకుని, ఐదుగురిని అదుపులోని తీసుకున్నట్లు తెలిపారు. అలాగే పాందువ్వలో మరో పేకాట స్థావరంపై డాడి చేసి వారి నుంచి రూ.10.400 నగదుతోపాటు నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నజీరుల్లా తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురై విజయవాడలో చికిత్స పొందుతున్న ఒక వ్యక్తి సోమవారం మృతి చెందాడు. ఏలూరు గిలకలగేటు ప్రాంతానికి చెందిన దాసరి వెంకటేశ్వరరావు(58) ఒక చిట్‌ఫండ్ కంపెనీలో పనిచేస్తున్నాడు. గత నెల 24న ఇంటికి వెళ్తుండగా రమామహల్ సెంటర్ వద్ద మోటార్‌సైకిల్‌పై నుంచి పడిపోవడంతో గాయాలయ్యాయి. విజయవాడ తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.

ఇళ్ల స్థలాల పేరిట మోసం!

వైసీపీ నేత ఇంటి వద్ద బాధితుల ఆందోళన - తీసుకున్న డబ్బు చెల్లించాలని డిమాండ్


మోరు రామరాజు ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న వడ్డిగూడెం గ్రామస్థులు

ఏలూరురూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలోని పెదపాడు మండలం వడ్డిగూడెం గ్రామానికి చెందిన వైసీపీ నేత మోసానికి పాల్పడ్డారంటూ పలువురు ఆందోళనకు దిగారు. గత వైసీపీ పాలనలో ఇంటి స్థలాలు ఇప్పిస్తానంటూ సుమారు రూ.57 లక్షలు తీసుకుని ఇవ్వకుండా తమను మోసం చేశాడంటూ వడ్డిగూడెం ప్రజలు ఆరోపించారు. ఈ మేరకు బాధితులు సోమవారం శనివారపేటలోని కట్టా సుబ్బారావుతోటలోని తన ఇంటి వద్ద పెద్దఎత్తున ఆందోళన నిర్వహించారు. తమకు డబ్బు తిరిగి చె ల్లించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బాధితులు ముంగర విష్ణు, జయమంగళ హరి బాబు, ఘంటసాల మారుతి, సర్పంచ్ జయ మంగళ దేవి మాట్లాడుతూ మోరు రామరాజు అనేవ్యక్తి 15 ఏళ్ల క్రితం, పొలం కొనుగోలు చేసి, స్థలాలు ఇస్తామంటూ 560 మంది నుంచి రెండో విడతగా సుమారు 57లక్షలు వసూలు చేశార న్నారు. వడ్డీగూడెం గ్రామస్థులు సొసైటీగా ఏర్ప రుచుకున్న చేపల చెరువు లీజుకు తీసుకుని వాటి డబ్బు కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. కాలం గడిచే కొద్ది స్థలాలు రిజిస్ట్రేషన్ చేయించకుండా తమ డబ్బులు తిరిగి ఇవ్వడం లేదని ఆరోపించా రు. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో అడి గిన వారిపై రామరాజు దౌర్జన్యం చేసేవారంటూ ఆరోపించారు. ఇటీవల తమకు న్యాయం చేయాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను కోరగా ఇదే విషయంపై మోరు రామరాజు సోషల్ మీడియా వేదికగా ఎమ్మెల్యేపై దుర్భాషలాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగే వరకు ఇక్కడే బైఠాయిస్తామని మహిళలు హెచ్చరించారు. మధ్యాహ్నం అక్కడే టీ కాచుకుని తాగి నిరసన కొనసాగించారు. త్రీ టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, బాధితులను సముదాయించే ప్రయత్నం చేసినా వినకుండా ఆందోళనలు కొనసాగించారు. ఘంటసాల మారుతి, బసవ శాస్త్రి, మోరు వెంకన్న, జయ మంగళ దుర్గాబాబు, భలే వీర్రాజు, మోరు సత్తిరాజు, గంటసాల సుబ్బరాజు, ముంగర రామకృష్ణంరాజు పాల్గొన్నారు.


కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ సీఐ లక్ష్మణరావు

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

ఏలూరు క్రైం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఏడుగురిని ఏలూరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు తన సిబ్బందితో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించి గుర్తించారు. వారిని సోమవారం ఏలూరు సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కెవిఆర్ మహేశ్వరి ముందు హాజరుపరిచారు. అతిగా మద్యం తాగిన ఒకరికి నాలుగు వేల రూపాయలు, మిగిలిన ఆరుగురికి ఒకొక్కరికి రూ.3 వేల వంతున జరిమానాలు విధించారని ట్రాఫిక్ సీఐ లక్ష్మణరావు తెలిపారు. ఏడుగురు మద్యం బాబులకు ఏలూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


పొలాల్లో ఉన్న కారు

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

కామవరపుకోట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఏలూరు-జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారిలో కొత్తూరు గ్రామం వద్ద కారు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. కారులో ఉన్న డ్రైవర్‌ను స్థానికులు సురక్షితంగా బయటకు తీశారు.

దమ్మపేటకు.. ఏపీ దొంగకోళ్ల పంచాయితీ

చోరీ జరిగిన కోళ్ల విలువ రూ.4 లక్షలు - చింతలపూడి పోలీసుల విచారణ

దౌర్జన్యం చేశారంటూ ఏపీ పోలీసులను స్టేషన్‌లో అప్పగించిన గ్రామస్థులు


చింతలపూడి పోలీసుల వాహనాన్ని అడ్డుకున్న దమ్మపేట వాసులు

దమ్మపేట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఏపీలోని ఏలూరు జిల్లా చింతపూడి మండలం పట్టాయిగూడెంలో గ్రామంలో జరిగిన పందెం కోళ్ల ఆచూకీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేటలో లభ్యమయ్యాయి. దీంతో చింతలపూడి పోలీసులు దమ్మపేట పోలీసులకు సమాచారం ఇవ్వకుండా విచారణకు రావడం, తమపై దౌర్జ న్యం చేశారంటూ దమ్మపేట వాసులు వారిని స్థానిక పోలీసులకు అప్పగించడం వివాదాస్పదమైంది. ఈఘటనకు సంబంధించి వివరాలివీ.. పట్టాయిగూడెం గ్రామానికి చెందిన రంగనాథ్ అనే రైతుకు చెందిన సుమారు రూ.4లక్షలు విలువ ఉండే నాలుగు పందెం కోళ్లు 10రోజుల క్రితం చోరీకి గురయ్యాయి. దీనిపై సదరు రైతు అక్కడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం తన పందెం కోళ్లు భద్రాద్రి జిల్లా దమ్మపేటలో ఉన్నట్లు సదరు రైతుకు సమాచారం అందటంతో.. చింతలపూడికి పోలీస్‌స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్, ఒక కానిస్టేబుల్, మరో హోం గార్డుతో కలిసి కోళ్ల ఆచూకీ కోసం సోమవారం ఉదయం దమ్మపేటకు చేరుకున్నారు. వీరితో పాటు నాలుగు కార్లలలో మరికొంత మంది కూడా రావడంతో గ్రామంలో ఉత్కంఠ వాతావరణం ఏర్పడింది. ఈ క్రమంలో వారంతా దమ్మపేటకు చెందిన గోపవరపు శేషగిరి ఇంటికి వెళ్లి దొంగకోళ్లు కొనుగోలు చేశారంటూ గొడవకు దిగారు. ఈ క్రమంలో 'నీ భర్త ఎక్కడ?' అంటూ ఇంట్లో ఉన్న రాజేశ్వరిపై ఏపీ పోలీసులు దురుసుగా మాట్లాడటంతో పాటు ఇంటి గేట్లు మూసివేసి ఇంట్లోని సీసీ కెమెరాలు, హార్డ్ డిస్కును స్వాధీనం చేసుకున్నారు. ఆమె తన భర్త ఇంట్లో లేదని చెప్పినా పట్టించుకోకుండా వారంతా ఆ ఇంటి వద్ద హల్‌చల్ చేయడంతో పాటు రాజేశ్వరి, ఆమెభర్తను దుర్భాషలాడుతూ అక్కడే కట్టేసి ఉన్న వేరే రెండు కోళ్లను పోలీసులు స్వాధీనం చేసుకొని తమ కారులో వేసుకొన్నారు. శేషగిరి ఇంటి వద్ద గొడవ జరుగుతున్న విషయం తెలుసుకున్న స్థానిక కాంగ్రెస్ నాయకుడు చిన్నశెట్టి యుగంధర్, పలువురు గ్రామస్థులతో అక్కడికి చేరుకుని ఏపీ పోలీసులను వెళ్లనీయకుడా వాహనాన్ని అడ్డుకొని దమ్మపేట పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే స్థానిక పోలీస్ ఘటనా స్థలానికి చేరుకొని స్థానికులకు నచ్చజెప్పి ఏపీ పోలీసులు, వారి వెంట వచ్చినవారిని దమ్మపేట స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న చింతలపూడి సీఐ క్రాంతి కుమార్ సోమవారం రాత్రి దమ్మపేట చేరుకుని తమ సిబ్బందిని తీసుకెళ్లారు. ఈ విషయంపై దమ్మపేట ఎస్ఐ సాయి కిషోర్ రెడ్డి వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): వర్షాలకారణంగా సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు సూచించారు. సోమవారం స్థానిక మోతేవారితోట ఏటిగట్టు పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో ఇంటింటా ఫీవర్ సర్వేను నిర్వహించారు. వైద్యాధికారిణి మానస మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీళ్ల, చెత్త నిల్వలు లేకుండా చూసుకోవాలని కోరారు. హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు కిసాన్ డ్రోన్లు పంపిణీ

నిడమర్రు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి):వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే తమ లక్ష్యమని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. సోమవారం ఉంగుటూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయలంలో నిడమర్రు మండలం చానమిల్లి, భువనపల్లి రైతులకు కిసాన్ డ్రోన్ పథకం కింద డ్రోన్లు పంపిణీ చేశారు. మండల వ్యవసాయాధికారిణి ఆశీర్వాదం, ఏఎంసీ చైర్మన్ ఎస్.జ్యోతి అయ్యప్ప, మండల కన్వీనర్ నిమ్మల దొరబాబు, నీటి సంఘం డీసీ బేతు రామారావు, అల్లుమోలు అరుణ్, ఏఎంసీ డైరెక్టర్ అల్లుమోలు దానయ్య పాల్గొన్నారు.

సీఐటీయూ నూతన కమిటీ ఏకగ్రీవం



మాట్లాడుతున్న సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ ఏలూరు జిల్లా మహాసభలు విజయవంతంగా పూర్తయ్యాయని జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ప్రధాన కార్యదర్శి డి.ఎన్.వి.డి. ప్రసాద్‌లు తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సోమవారం వారు మాట్లాడుతూ తమను నూజివీడులో జరిగిన మహాసభల్లో అధ్యక్ష, కార్యదర్శులుగా ఏకగ్రీవంగా ఎంపికయ్యామని, తమతో పాటు 19 మంది ఆఫీస్ బేరర్స్‌ను, 64 మందితో నూతన కమిటీని ఎంపిక చేశారన్నారు. జిల్లా కోశాధికారిగా ఐ.వి.సుధాకర్, ఉపాధ్యక్షులుగా పి.భారతి, ఎస్.రమణారావు, ఆర్.వి.ఎస్.నారాయణ, ఎస్.రాంబాబు, కె.వి.కె.ఎస్.ప్రసాద్, ఎం.నాగమణి, ఎం.దుర్గారావు, పి.సూర్యారావులు ఎంపికయ్యారన్నారు. జిల్లా కార్యదర్శులుగా జి.రాజు, కె.పోసమ్మ, వై.సాయికిరణ్, ఎం.ఇస్సాకు, కె.శ్రీనివాస్, జో.గోపి, పి.మాణిక్యం, జె.మహేష్‌లు ఎన్నికయ్యారన్నారు.

శిక్షణ తరగతులు జయప్రదం చేయండి : ఇఫ్టూ


ప్రచార పత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

పెదవేగి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఏలూరులో నవంబరు ఒకటి నుంచి 4వ తేదీ వరకు జరిగే ఇఫ్టూ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు జయప్రదం చేయాలని ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు(యూవీ) విజ్ఞప్తి చేశారు. పెదవేగి మండలం వంగూరులోని ఇఫ్టూ అనుబంధ సంస్థ గౌతమీ ఆగ్రో ఇండస్ట్రీస్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శిక్షణ తరగతులకు సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. యూవీ మాట్లాడుతూ కార్మికుల పట్ల కేంద్రం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, యూనియన్ నాయకులు బెజవాడ పద్మ, మరడాని రంగమ్మ, సత్యవతి, మోతీ భవానీ, లిల్లీపుష్ప, బేబీ కృప, కోటేశ్వరరావు, బి.రాణి, తోట రాణి, కే.రాణి, అనసూయమ్మ, సుజాత, రంగబాబు పాల్గొన్నారు.

గ్రామ సభల తర్వాతే భూసేకరణ చేయాలి

బుట్టాయగూడెం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి):టైటిల్ వెరిఫికేషన్ లింకు డాక్యుమెంటరీ ఆధారంగా గ్రామ సభలు జరిగిన తర్వాతనే భూసేకరణ పనులు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసీ విజ్ఞాన కేంద్రం వద్ద సోమవారం మండల కమిటీ సమావేశం ఉడతా వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరగ్గా రవి పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆర్ అండ్ ఆర్ భూసేకరణలో గ్రామ సభలు నిర్వహించకుండానే పీసా కమిటీలు, పంచాయతీ సర్పంచులపై అధికారులు ఒత్తిడి తెచ్చి సంతకాలు చేయిస్తున్నారని ఇది ఏజెన్సీ చట్టానికి పూర్తిగా విరుద్ధమన్నారు. ఎటువంటి వివాదాలు లేని భూములను మాత్రమే భూసేకరణ చేయాలని డిమాండ్ చేశారు. ఎం.నాగమణి, తెల్లం రామకృష్ణ, కారం భాస్కర్, పూనెం శేఖర్, భీమరాజు, గంగరాజు, వెంకటలక్ష్మి ఉన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగించుకోవాలి

లింగపాలెం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బుధవారం నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు జరిగే వైద్య శిబిరాలను మహిళలు ఉపయోగించుకోవాలని డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ లిఖిత అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో స్వస్థనారీశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో బాగంగా మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు. లింగపాలెం ఎంపీడీవో కె.వాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండలంలోని లింగపాలెం, ధర్మాజీగూడెం, కె.గోకవరం పీహెచ్‌సీలతో పాటు మండలంలోని అన్ని ఆయుష్మాన్ మందిరాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. డాక్టర్ అబీదా, కె.అర్జునరావు, కె.పద్మజ, యు.ఇమిలిబాబు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

ద్వారకాతిరుమల/నిడమర్రు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీవారి శేషాచలంపై ఉన్న గోసం రక్షణ శాలలోని గోవులకు సోమవారం గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. గోశాలలో ఉన్న 250 ఆవులకు, 54 దూడలకు ఈ టీకాలు వేశారు. అలాగే గ్రామంలోని 120 గేదెలకు 30 ఆవులకు సైతం టీకాలను వేయించినట్లు పశు వైద్యులు అంగర సురేష్ తెలిపారు. వచ్చే నెల 15 వరకూ జాతీయ గాలికుంటు వ్యాధినివారణ కార్యక్రమంలో బాగంగా మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో వైద్య సిబ్బంది పశువులకు ఈ టీకాలను అందజేస్తారన్నారు. ఈ టీకాలు వేస్తే పాలు తగ్గిపోతాయన్న అపోహను రైతులు వీడనాడి 6నెలల వయస్సు పైబడిన వాటికి ఈ టీకాలను వేయించాలని సూచించారు.నిడమర్రు మండలంలో పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తున్నట్టు నిడమర్రు పశుసంవర్ధకశాఖ అధికారి వి.ఎస్.సందీప్ తెలిపారు. సోమ వారం అడవికొలనులో 200పశువులకు టీకాలు వేశామన్నారు. పశు వైద్య సిబ్బంది గణేశ్ పాల్గొన్నారు.

స్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలి: ఎమ్మెల్యే చంటి



ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీవిఘ్నేశ్వర స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాల ని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. సోమవారం చాణిక్యపురి కాలనీలో గణపతి స్వామి 23వ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా బారీ అన్నసమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే చంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే చంటి తెలిపారు. అన్న సమారాధనలో ఇడా చైర్మన్ శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ ఎం.పార్థసారది, డిప్యూటీ మేయర్ ఉమామహేశ్వరరావు, టీడీపీ నగర అధ్యక్షుడు చోడే వెంకటరత్నం, శ్రీనివాసరావు, దుర్గారావు, ఈశ్వర్, దుర్గారావు పాల్గొన్నారు.

ఇళ్లు సరే.. ఇంకుడు గుంతలేవీ?

(5వ పేజీ తరువాయి)

మాత్రమే ఇంకుడు గుంతలున్నాయి. నిర్వహణ లేక అవీ నిరుపయోగంగా ఉన్నాయి. ఇదిలా ఉండగా గతంలో నిర్మించిన ఇంకుడు గుంతలు కొద్దిపాటి మరమ్మతులు చేస్తే.. అవి మళ్లీ వినియోగించే అవకాశం ఉన్న వివిధ ప్రభుత్వశాఖల్లో వాటిని పట్టించుకోవడం లేదు.

అందరూ నడుం బిగిస్తేనే : ప్రతీ మూడో శనివారం ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా ఇంకుడు గుంతల నిర్వహణపై కాస్తంత ప్రచారం, పర్యవేక్షణ చేయించాల్సిన అవసరం ఉంది. భూగర్భ జల వనరులు పుష్కలంగా ఉంటే నీటికి కొదవ ఉండదు. కాల్వల నుంచి నీరు రాకపోయినా బోర్లు, బావులు ఆ అవసరాలను తీర్చుతాయి. గతేడాది నుంచి ఇటీవల వర్షాకాలం భారీ వర్షాలే కురిశాయి. దీంతో భూగర్భజల మట్టం పెరిగింది. ఆశించిన స్థాయిలో వర్షాలు పడకుంటే మార్చి, ఏప్రిల్, మే, జూన్ నెలల్లో పట్టణాల్లో తాగునీటికి కటకటలాడాల్సిన పరిస్థితి నెలకుంటుంది. భవిష్యత్‌లో తాగునీటి ఎద్దడిని తప్పించుకోవాలంటే ప్రతీ ఒక్కరూ నీటి పొదుపునకు నడుం బిగించాలి. నివాస ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి నీరు ఇంకేలా చేయాలి.

మళ్లీ గోదావర్రీ!

(5వ పేజీ తరువాయి)


కుక్కునూరులో గోదావరి

సోమవారం ఉదయం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో కొండవాగులు పొంగాయి. రెడ్డిగణపవరం జల్లేరు కొండవాగు పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి వాగు కొట్టుకుపోవడంతో గ్రావెల్‌తో తాత్కాలిక మరమ్మతులు చేశారు. సోమవారం ఉదయం మరలా వర్షం కురవడంతో తాత్కాలిక రోడ్డుకు కష్టాలు తప్పలేదు.

తమ్మిలేరులో కొనసాగుతున్న వరద : ముసునూరు : మండల పరిధిలో తమ్మిలేరు వరద ఉధృతి కొనసాగుతోంది. సోమవారం తహసీల్దార్ దాసరి ప్రశాంతి, ఎస్ఐ ఎం.చిరంజీవి వరద ప్రవాహన్ని పరిశీలించారు. తమ్మిలేరు పరీవాహక గ్రామాలైన గుళ్ళపూడి, లోపూడి, వలసపల్లి, యల్లాపురం, బలివే, రంగంపేట, వేల్పుచర్ల గ్రామాల్లో ఉన్న ర్యాంపుల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గ్రామస్థాయి అధికారులు, పోలీసులతో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ తెలిపారు.

ఘనంగా విశ్వేశ్వరయ్య జయంతి

ఏలూరు,సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య 164వ జయంతిని ఏలూరు ఇరిగేషన్ డేటా కాంప్లెక్సులో సోమవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఇరిగేషన్ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, ఇంజనీర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అక్కడే ఉన్న విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జలవనరుల శాఖ ఎస్ఈ సీహెచ్ దేవప్రకాష్, నీరు -ప్రగతి ఎస్ఈ వెంకట స్వామి, పోలవరం కుడి కాల్వ ప్రధాన కాల్ల డిప్యూటీ ఎస్ఈ కె.రాజు, డీఈఈలు పి.గనిరాజు, దేవరకొండ వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

● ఏలూరురూరల్:స్థానిక విద్యుత్ భవన్‌లో సోమవారం విద్యుత్ ఉద్యోగుల ఓసీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్‌డే నిర్వహించారు. పలువురు ఇంజనీర్లను శాలువాలతో సత్కరించారు. ముఖ్యఅథితిగా పాల్గొన్న సూపరింటెంటింగ్ ఇంజనీర్ సాల్మన్‌రాజు, ఆపరేషన్ ఏలూరు ఇంజనీర్ కె.ఎం.అంబేడ్కర్ మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చేసిన సేవలు, కట్టిన ప్రాజెక్టులు, వివిధ రంగాల్లో ఆయన చేసిన కృషిని కొనియాడారు. అసోసియేషన్ నాయకుడు తురగా రామకృష్ణను ఇంజనీర్‌లు, అన్ని యూనియన్‌ల నాయకులు ఘనంగా సత్కరించారు. హేలాపురి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇంజనీర్‌డే వేడుకలు నిర్వహించారు.

● చింతలపూడి: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే సందర్భంగా విద్యుత్ శాఖ ఏఈ వెంకయ్యను ఆయన కార్యాలయంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. క్లబ్ అధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య పుట్టిన రోజును ఇంజనీర్స్‌డేగా జరుపుకుంటారని, ఈ సందర్భంగా వెంకయ్య సేవలను గుర్తించి సన్మానించారు. సభ్యులు డి.రామకృష్ణ, సి.హెచ్.రామ్మోహన్‌రావు, చంద్రశేఖరరెడ్డి, సి.హెచ్. అబ్బయ్య, సుధాకర్, కేశవరావు, శేషగిరిరావు పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల: ఇంజనీర్ల కృషి, సృజనాత్మకత, అంకితభావాన్ని ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలని లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు, మాజీ జడ్పీటీసీ మొగతడకల లక్ష్మీరమణి అన్నారు. ద్వారకాతిరుమలలో ఇంజనీర్స్ డేను ఆమె ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. స్థానిక మైనింగ్ ఇంజనీర్ లయన్ నార్ల కాశీనాథంతో పాటు మరో ఆరుగురు మండల ఇంజనీర్లను లయన్స్ క్లబ్ సభ్యులు సత్కరించి అభినందనలు తెలిపారు.



ద్వారకాతిరుమలలో ఇంజనీర్లను సత్కరించిన దృశ్యం

మొగతడకల శ్రీనివాసరావు, దేవరపల్లి రాయుడుబాబు, పావులూరి మధు, నార్ల రాజేంద్రనాథ్ పాల్గొన్నారు.

● కామవరపుకోట: జీలకర్రగూడెం గ్రామంలో సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డేను నిర్వహించారు. కామవరపుకోట పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ ఆశిక్ దుశ్శాలువాతో లయన్స్ క్లబ్ నాయకులు సత్కరించారు. ఇంజనీర్లు అందిస్తున్న సేవలను లయన్స్ క్లబ్ ప్రతినిధులు అభినందించారు. జీలకర్రగూడెం లయన్స్ క్లబ్ వ్యవస్థాపకులు ఎస్.ఆర్.ఆర్. యర్రంరాజు, రీజనల్ చైర్ పర్సన్ ఆర్.ఆర్.రత్నకుమారి, మాజీ అధ్యక్షులు అల్లూరి పెద్దిరాజు, లయన్స్ క్లబ్ నాయకులు రేగుంట సురేశ్, ఎల్.ఎన్.మహేశ్వరి, బాహుబలేంద్రుని బాలవర్ధిరాజు పాల్గొన్నారు.

మా సమస్యలు పట్టించుకోండి



ఆందోళన చేస్తున్న మునిసిపల్ వర్కర్లు

జిల్లా వ్యాప్తంగా పలు సంఘాల ఆందోళనలు

ఏలూరురూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): చనిపోయిన ఆయిల్‌పామ్ కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ఆయిల్‌పామ్ కార్మికుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు పి. రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, ఆంధ్రప్రదేశ్ ఆయిల్‌పామ్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. జిల్లాలో 13 మండలాల్లో ఆయిల్‌పామ్ విస్తారంగా పండుతోందన్నారు.తోటల్లో పనిచేస్తున్న కార్మికులకు విద్యుత్‌షాక్ తగిలి ఇప్పటి వరకు 8 మంది చనిపోయారని, వారి కుటుంబాలకు విద్యుత్ శాఖ అధికారులు ఐదు లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. జె.హరీశ్, ఎం.సత్యనారాయణ. కె.రాంబాబు, కె.నివాస్, బి.వర్మ, ఎం.లక్ష్మణ్, వెంకన్న పాల్గొన్నారు.

స్కూల్ స్వీపర్లకు కనీసవేతనాలివ్వాలి..

స్కూల్ స్వీపర్లు, స్కూల్ శానిటేషన్ వర్కర్లకు, నైట్ వాచ్‌మెన్‌లకు జీవో-7 ప్రకారం కనీస వేతనాలు రూ.15 వేలు ఇవ్వాలని, స్కూల్ స్వీపర్లు, శానిటేషన్ వర్కర్లకు రావాల్సిన రెండు నెలల బకాయి జీతాలు ఇవ్వాలని కోరుతూ స్కూల్ స్వీపర్లు, శానిటేషన్ వర్కర్లు, నైట్ వాచ్‌మెన్‌లు ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు సోమయ్య మాట్లాడుతూ స్కూల్ స్వీపర్లు, శానిటేషన్ వర్కర్లు రోజుకు 8 నుంచి 10 గంటలు పని చేస్తున్నారని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం స్కూల్ స్వీపర్లు, శానిటేషన్ వర్కర్లకు జీవో నెంబర్ 7 ప్రకారం రూ.15వేలు వేతనాలు పెంచి అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పొలిటికల్ సైన్స్ మేజర్ సబ్జెక్ట్ కావాలి..

కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ మొదటి సంవత్సరంలో 2025-26 విద్యా సంవత్సరం అడ్మిషన్ పొందిన విద్యార్థులకు పొలిటికల్ సైన్స్ సబ్జెక్టు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఏఐఎస్ఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు డి.శివకుమార్, జిల్లా కోశాధికారి ఎం.క్రాంతికుమార్ తెలిపారు. పొలిటికల్ సైన్స్ సబ్జెక్టు పెట్టాలని కోరుతూ కలెక్టర్ ఎదుట సోమవారం నిరసన తెలిపారు. అనంతరం జేసీ ధాత్రిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఏఐఎస్ఎఫ్, నాయకులు సిద్దు, విద్యార్థులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఆయిల్‌పామ్ వర్కర్లు

పోడు భూములకు పట్టాలివ్వాలి

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): అటవీ హక్కుల చట్టం ప్రకారం సాగులో ఉన్న పోడు భూములకు పట్టాలివ్వాలని, వలస ఆదివాసీ పిల్లలకు కులధ్రువీకరణ పత్రాలు మంజూరు చెయ్యాలని ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కారం ధారయ్య డిమాండ్ చేశారు. సోమవారం జంగారెడ్డిగూడెం డివిజన్ అధికారి కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. జీలుగుమిల్లి మండలంలో ఆయుధ కర్మాగారం డిపో ఏర్పాటును విరమించుకోవాలన్నారు. గిరిజనులకు కులధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో విద్యావంతులైన గిరిజనులకు ఉద్యోగాలు రావడంలేదన్నారు. గిరిజనసమాఖ్య నాయకులు పిట్టి వీరయ్య, అర్జున్, కరాటం వెంకటేసు, నగేశ్, మారయ్య పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

సొసైటీని అభివృద్ధి చేస్తాం

మోరంపూడి మల్లికార్జునరావు, సింగగూడెం పీఏసీఎస్ చైర్మన్



• సొసైటీ అధ్యక్షుడిగా రైతుల సమస్యలపై మీ చర్యలేంటి?

రైతులకు అవసరమైన పంట రుణాలను సకాలంలో ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. సంఘ పరిధిలో ప్రతి రైతుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అవసరానికి సరిపడా అందించేలా చూస్తున్నాం.

• పీఏసీఎస్ అభివృద్ధికి మీ చర్యలు..

సొసైటీ బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నాం. బ్యాంకును లాబాల బాటలో తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం. సంఘం పరిధిలో అర్హత ఉన్న ప్రతి రైతును సభ్యులుగా చేర్చుకుంటాం.

• రుణాల మంజూరులో సమస్యలున్నాయా?

ఈ సొసైటీలో 1723 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. ఇప్పటి వరకు రైతులకు 32 కోట్ల రూపాయల రుణాలు అందించాం. ప్రస్తుతానికి రుణాల రికవరీ బాగానే ఉంది.

• పీఏసీఎస్ అభివృద్ధికి ఇంకా ఏం చేస్తున్నారు.

అక్టోబరు 2 నుంచి ఆన్‌లైన్‌లో లావాదేవీలు జరిపేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం.

\- లింగపాలెం

ఎస్‌వోపీపై శిక్షణ

ఏలూరుసిటీ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పీ4 ఇనిషియేటివ్స్ ఎస్‌వోపీపై జిల్లా స్థాయి శారీరక శిక్షణ ఈ నెల 16వ తేదీ ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు మండలానికి ఇద్దరు, మున్సిపాల్టీకి ఐదుగురు చొప్పున ఏంవోటీల కోసం షెడ్యూల్ చేసినట్టు సీపీవో సి.హెచ్.వాసుదేవరావు సోమవారం తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమం ఏలూరు కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో జరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణలో మండలానికి 10మంది చొప్పున జీఎస్‌డబ్ల్యుఎస్ సిబ్బంది, స్వర్ణాంధ్ర పీ4 పౌండేషన్ రాష్ట్ర బృందం కూడా పాల్గొంటారని ఆయన వివరించారు.

సీఐటీయూ కార్యదర్శిగా సాయికిరణ్

కుక్కునూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ ఏలూరు జిల్లా కార్యదర్శిగా కుక్కునూరు మండలానికి చెందిన వై.సాయికిరణ్ 2వ సారి తిరిగి ఎన్నికయ్యారు. సోమవారం కుక్కునూరులో విలేకర్లతో మాట్లాడారు. నూజివీడులో జరిగిన సీఐటీయూ 13వ జిల్లా మహాసభల్లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాలో కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై సీఐటీయూ నిరంతరం పోరాటం జరుగుతుందన్నారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేసినట్లు సాయికిరణ్ తెలిపారు.

మౌలిక వసతులు కల్పించాలి

కుక్కునూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): కుక్కునూరు ఏజెన్సీలో వలస గిరిజనులకు మౌలిక సదుపాయాలు, వసతులు కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి కొన్నే లక్ష్మయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.వలస గిరిజనుల సమస్యలపై కుక్కునూరు తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించారు. గిరిజనులకు రహదారులు, మెరుగైన వైద్యం, విద్య అందించాలని వినతిపత్రంలో కోరారు. చోడే నాగేశ్, రమేశ్, మారయ్య, శ్రీను, మడకం భీమయ్య పాల్గొన్నారు.

హౌసింగ్ డీఈగా శేఖర్

ఉంగుటూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు డివిజన్ ఇన్‌చార్జి హౌసింగ్ డి.ఈగా శేఖర్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధర్మరాజు గృహ నిర్మాణ పనులు గురించి పలు అంశాలు చర్చించారు. హౌసింగ్ ఏఈ సతీశ్ పాల్గొన్నారు.

పడమర వీధి జాతర కమిటీ ఎన్నిక

ఏలూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఏలూరులో 12 ఏళ్లకు ఒకసారి జరిగే జాతరకు సంబంధించి ఏలూరు పడమర వీధి జాతర కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా సాగింది. టీడీపీ సీనియర్ నేత మధ్యాహ్నపు బలరామ్ తండ్రి మధ్యాహ్నపు రామకృష్ణదాసు కమిటీకి సెక్రటరీగా ఎన్నికయ్యారు. కోశాధికారిగా బత్తుల వెంకటేశ్వరరావు, జాతర పూజారి నానిలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎంఆర్‌డీ బలరామ్, రాళ్లపల్లి రవికుమార్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకంగా జరిగే ఏలూరు జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామన్నారు. జాతరకు సంబంధించి ఏమైనా అపోహలుంటే కమిటీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు.

రోడ్లు అభివృద్ధి చేయండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

టి.నర్సాపురం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): టి.నర్సాపురం అంబేడ్కర్ సెంటర్ నుంచి సినిమాహాలు సెంటర్ వరకు అధ్వానంగా ఉన్న రోడ్లు అభివృద్ధి చేయాలని కోరుతూ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్తలు, ప్రజాసమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ టి.సాయిబాబా, ఎంపీడీవో నగరాజకుమారిలకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త ఎస్.వి.నాజర్‌బాషా మాట్లాడుతూ మండల కేంద్రం టి.నర్సాపురం అంబేడ్కర్ సెంటర్ నుంచి బంధంచర్ల రోడ్డులోని విజయలక్ష్మి థియేటర్ వరకు రోడ్డు అధ్వానంగా తయారైందన్నారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో రోడ్డుపై ఉన్న గుంతల్లో వర్షపునీరు నిలిచి చెరువులను తలపిస్తోందన్నారు.తూర్పుగూడెం, గండిగూడెం, కొరివిరామన్నపాలెం, బంధంచర్ల, జగ్గవరం, అల్లంచర్లరాజుపాలెం, తెడ్లం, జీలకర్రగూడెం, కామవరపుకోటకు చెందిన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అధికారులు స్పందించి అంబేడ్కర్ సెంటర్ నుంచి సినిమా హాలు సెంటర్ వరకు సీసీ రోడ్డు, ఇరువైపులా డ్రైనేజీ ఏర్పాటు చేయాలని కోరారు. జమిలాబేగం, సామాజిక కార్యకర్తలు కొరివి వెంకటేశ్వరరావు, కొరివి నాగేశ్వరరావు, పింగుల మధు, రెడ్డి శ్రీనివాస్, బి.రమేశ్, నార్లపాటి ప్రసాద్ పాల్గొన్నారు.

ఫిజికల్ ఎడ్యుకేషన్‌కు ఎంపికైన లావణ్య

పెదవేగి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): కూచింపూడికి చెందిన మోర్ల లావణ్య ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు. దెందులూరు మండలం గోపన్నపాలెం పంచాయతీ వేగవరం గ్రామానికి చెందిన మోర్ల లావణ్య గోపన్నపాలెంలోని వ్యాయామ కళాశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ చేశారు. మెగా డీఎస్సీలో జిల్లా 38వ ర్యాంకుతో ఉపాధ్యాయ ఉద్యోగం పొందారు. లావణ్య భర్త బొల్లా చంద్రశేఖర్ 2018లో డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్‌గా జిల్లా ప్రథమ స్థానంలో నిలిచి, స్కూల్ అసిస్టెంట్‌గా ఉపాధ్యాయ ఉద్యోగంలో చేరారు. గార్లమడుగులో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఇప్పుడు భార్య లావణ్యకు కూడా ఉద్యోగం రావడంతో వారి కుటుంబంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి.


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

అర్హులందరికీ సొంతిళ్లు : చింతమనేని

పెదవేగి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి పేదకుటుంబానికి సొంతిల్లు సాకారం దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో సోమవారం పలువురు ప్రజలు ఇళ్ల స్థలాల కోసం వినతులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు సొంతింటి కలను సాకారం చేయడాన్ని కూటమి ప్రభుత్వం బాధ్యతగా తీసుకుందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల అవసరాలకు సరిపడా ఇంటిస్థలం ఇస్తుందని, గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇస్తామన్నారు.

అశోక్ కుమార్ వైద్యానికి సాయం

బుట్టాయగూడెం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి మంచానికే పరిమితమైన బుట్టాయగూడెం కొత్తపేటకు చెందిన చెందిన యర్రమళ్ళ ఆశోక్ కుమార్‌కు కె.9 పేరుతో ఏర్పాటైన కాపు సంక్షేమ సంఘం ప్రతినిధులు సోమవారం బాధితుడి ఇంటికెళ్లి బియ్యం, వంటసామగ్రి, నిత్యావసరాలు, రూ.5 వేలు నగదును అందజేశారు. ఇప్పటికే ఆశోక్ కుమార్ వైద్యానికి రూ.6 లక్షలు ఖర్చయ్యిందని ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నట్టు ప్రతినిధులు తెలిపారు. మెరుగైన వైద్యం కోసం ఎమ్మెల్యే, ఎంపీల సాయం కోరారు. కె.9 అధ్యక్ష, కార్యదర్శులు టి.శ్రీనివాసరావు,ఎస్.కృష్ణంరాజు, కోశాధికారి పి.మోహన్, ఎం.సత్యన్నారాయణ, యు.ఏసుబాబు, కెఎస్ శంకరరావు, ఎ.ఏసుబాబు పాల్గొన్నారు.

మండల సమావేశంలో సమస్యలు ఏకరువు

వేలేరుపాడు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. మండలంలోని ప్రజాప్రతినిధులు దాదాపు 20 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా వరుస క్రమంలో ఆయా శాఖల అధికారులు మండల ప్రజాప్రతినిధులకు తమ శాఖల ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలు వివరించారు.ఎంపీపీ వాళ్ల లక్ష్మీదేవి అధ్యక్షత వహించగా, జడ్పీటీసీ రామలక్ష్మి ఎంపీడీవో శ్రీహరి, డీటీ సురేంద్ర పాల్గొన్నారు.



అంకాలగూడెంలోకి వరద

కొయ్యలగూడెం, సెప్టెంబర్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకాలగూడెం కొత్తపేట బీసీ వసతిగృహం ప్రాంతంలో వరద చేరింది. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొండవాగులు పొంగి చెరువులు నిండిపోవడంతో చెరువుల నుంచి వరదనీరు గ్రామంలోకి చేరింది. దీంతో అంకాలగూడెం కొత్తపేట ఏరియాలో గత రెండ్రోజుల నుంచి వరదలోనే ప్రజలు నివసిస్తున్నారు. దీంతో సోమవారం ఈ విషయం కూటమి నాయకులకు చేరడంతో హుటాహుటిన జనసేన మండల అధ్యక్షుడు తోట రవి, టీడీపీ నాయకులు మేఘలాదేవి, నాయకులు ఏపూరి సతీశ్, మాదేపల్లి శ్రీను, సంఘటన స్థలానికి వెళ్లి పంచాయతీ, రెవెన్యూ అధికారులను రప్పించారు. తక్షణమే చర్యలు చేపట్టాలని కోరడంతో జేసీబీ సాయంతో ఆ నీరంతా కాల్వలోకి వెళ్లేల దారులు తీశారు. అనంతరం కాల్వలో చెత్తను తొలగించారు. ఎప్పుడు వర్షంపడిన ఆ ప్రాంతం నీటమునుగుతుందని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు. ప్రభుత్వం గ్రామంలోకి వరదనీరు రాకుండా కాల్వలకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

సిమ్లాలో గన్నికి సత్కారం

ఏలూరు,సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం సిమ్లాలో మూడు రోజుల నుంచి జరుగుతున్న జాతీయ సహకార సదస్సు సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా న్యాప్‌కాబ్ చైర్మన్ కె. రవీంద్రరావులతో కలిసి ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులును సత్కరించారు.

సీఆర్ఆర్‌లో క్యాంపస్ ఎంపికలు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సీఆర్ఆర్ కళాశాలలో సోమవారం దివీస్ ల్యాబ్స్ ఆధ్వర్యంలో బీఎస్సీ ఎంఎస్సీ, ఫార్మసీ విద్యార్థులకు క్యాంపస్ సెలక్షన్లు నిర్వహించారు. రాత, మౌఖిక పరీక్షల్లో అర్హతసాధించిన అభ్యర్థులకు వారి వ్యక్తిగత ఈ-మెయిల్స్‌కు ఆఫర్ లెటర్లు జారీ చేస్తామని సంస్థ హెచ్ఆర్ రాజేశ్ తెలిపారు. ప్రిన్సిపాల్ రామరాజు, కరస్పాండెంట్ డాక్టర్ విష్ణుమోహన్ పర్యవేక్షించారు.

డీఎస్సీ నియామకాలపై హర్షం

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌కు ఎంపికైన అభ్యర్థుల జాబితాలను విడుదల చేయడం ద్వారా ప్రభుత్వం నిరుద్యోగ ఉపాధ్యాయులకిచ్చిన హామీని నిలబెట్టుకుందని టీడీపీ అనుబంధ ఉపాధ్యాయ విభాగం నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా నాయకులు బి.రాము హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ దసరాకు రెండు పెండింగ్ డీఏలు ఇవ్వాలని, పీఆర్సీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

జీలుగుమిల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్యానికి సీఎం సహాయ నిధి దోహదపడుతోందని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. సోమవారం బర్రింకలపాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద సీఎంఆర్ఎఫ్ చెక్కులు రూ.19 లక్షలు సుమారు 23 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు.

● జంగారెడ్డిగూడెం: చక్రదేవరపల్లి, లక్కవరం, నిమ్మలగూడెం గ్రామాల్లో టీడీపీ మండలాధ్యక్షుడు, చక్రదేవరపల్లి సర్పంచ్ సాయిల సత్యనారాయణ చేతులమీదుగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించారు. ఆరుగొల్లు గంగ, పి.నాగిరెడ్డి, కొండ్రెడ్డి వీరాసావమి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు బొరగం పరామర్శ


పరామర్శిస్తున్న బొరగం

జీలుగుమిల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): వరద ఉధృతికి పూచికపాడుకు చెందిన ఇద్దరు మహిళా కూలీలు గల్లంతవడంతో ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ బాధిత కుటుంబాలను పరామర్శించారు. తెలంగాణ ప్రాంతం చెన్నాపురం వద్ద కూలీ పనికి వెళ్లి వస్తూ వరద ఉధృతికి కొండవాగు దాటుతుండగా కొట్టుకుపోగా పాలడుగుల చెన్నమ్మ, మృతదేహం లభ్యమైందని, పచ్చిపాల వరలక్ష్మి ఆచూకీ లభించలేదన్నారు. ఆ కుటుంబాలను టీడీపీ మండలాధ్యక్షులు సుంకవల్లి సాయి, ఉండవల్లి సోమసుందరం, ఎంపీటీసీ నాలి శ్రీను, సోయం ప్రకాశ్, వీరంకి పాపారావు, వెలగల అజయ్, ఉండవల్లి కిరణ్, సుంకవల్లి రాజేశ్, గారపాటి శ్రీను పరామర్శించారు.

అంబికాదేవి సన్నిధిలో శరన్నవరాత్రులు


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న అంబికాప్రసాద్

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సత్రంపాడులోని అంబికాదేవి ఆలయంలో ఈ నెల 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్టు అంబికా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ అంబికా ప్రసాద్, అంబికా ఆలయ ప్రధానార్చకులు వారణాసి రాఘవేంద్రశర్మ, సాహితీవేత్త డాక్టర్ అనంతలక్ష్మి తెలిపారు. అంబికాదేవి ఆలయ ప్రాంగణంలో శరన్నవరాత్రి మహోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబికాదేవి అమ్మవారిని శరన్నవరాత్రి మహోత్సవాల్లో రోజుకో అలంకారం జరిపి భక్తులకు దర్శనమిస్తామని, ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, హోమాలు, పారాయణలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 3న మహా అన్నసమారాధన ఏర్పాటు ఉంటుందని తెలిపారు.

!రేపటి నుంచి ఆరోగ్య కేంద్రాల్లో వైద్య శిబిరాలు

చాట్రాయి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పుట్టిన రోజు సందర్భంగా ప్రారంభం కానున్న 'స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్' పథకంలో భాగంగా ఈ నెల 17 నుంచి అక్టోబరు 2 వరకు అన్ని ఆరోగ్య కేంద్రాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ దుర్గాప్రసాద్ తెలిపారు. మండలంలోని మహిళలు, బాలికలు, పిల్లలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

18, 19 తేదీల్లో ఆటల పోటీలు

మండవల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల స్థాయి ఆటల పోటీలు ఈ నెల 18, 19 తేదీల్లో నిర్వహిస్తున్నట్టు ఎంఈఓ-1 సురేష్ తెలిపారు. స్థానిక మండల వనరుల కేంద్రంలో సోమవారం మండలంలోని వ్యాయామోపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్, చెస్, యోగా, అథ్లెటిక్స్ విభాగాల్లో బాలురు, బాలికలకు విడివిడిగా పోటీలు నిర్వహిస్తామన్నారు. మండలంలోని లింగాల జడ్పీ హైస్కూల్‌లో ఉదయం 9 నుంచి పోటీలు ప్రారంభమవుతాయన్నారు.



గోపవరం ఎరువుల దుకాణంలో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

విజిలెన్స్ తనిఖీలు.. ఎరువులు సీజ్

మునునూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపవరం, మునునూరు గ్రామాల్లోని ఎరువుల దుకాణాల్లో సోమవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఏలూరు రీజనల్ విజిలెన్స్ అధికారి బి.కన్యాకుమారి, ఎస్ఐ సీహెచ్.రంజిత్ కుమార్ ఎరువుల దుకాణాల్లో రికార్డులు, స్టాక్ నిల్వలను తనిఖీ చేశారు. గోపవరంలో కోరమండల్ ఎంటర్‌ప్రైజస్ దుకాణంలో ఎరువులు నిల్వకు, ఈ-పోస్ డేటాకు వ్యత్యాసం ఉన్నట్టు గుర్తించారు. సుమారు రూ. 1.55 లక్షల విలువైన 5.350 మెట్రిక్ టన్నుల ఎరువుల స్టాక్‌ను సీజ్ చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. వీఆర్వో ప్రజ్ఞ, వీహెచ్ఏ దుర్గ తదితరులు పాల్గొన్నారు.



పోలవరంలో రైతులతో కలసి వరి పైరు పరిశీలిస్తున్న ఏవో

నష్టపోయిన రైతులకు పరిహారం ఇప్పిస్తాం

చాట్రాయి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): నాసిరకం వరి విత్తనాల వల్ల నష్టపోయిన రైతులకు సదరు కంపెనీ నుంచి పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఏవో శివశంకర్ హామీ ఇచ్చారు. 'నిండా మునిగాం' శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పోలవరం గ్రామంలో సోమవారం చాట్రాయి ఏవో శివశంకర్ రైతులతో కలిసి నాసిరకం వరి విత్తనాలతో సాగుచేసిన పొలాలను పరిశీలించారు. పీఎల్-1100 విత్తనాలలో ఎంటీయు- 1156 విత్తనాలు కలవటం వలన ఈ పరిస్థితి ఏర్పడిందని పలువురు రైతులు ఏవోకు వివరించారు. త్వరలో సదరు కంపెనీ ప్రతినిధులను కలిసి బాధిత రైతులకు నష్ట పరిహారం అందించటానికి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని ఏవో చెప్పారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రక్షణ వలయం ఏర్పాటుకు చర్యలు

కలిదిండి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కలిదిండి సెంటర్‌లో ప్రమాదకర రంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ రక్షణ వలయం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ డిఈఈ రాంబాబు తెలిపారు. ఆంధ్రజ్యోతిలో సోమవారం 'ట్రాన్స్‌ఫార్మర్..టెర్రర్' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న పూలు, పండ్ల దుకాణాలు, బల్లను తొలగిస్తామన్నారు. త్వరలో శాశ్వత రక్షణ వలయం ఏర్పాటు చేస్తామన్నారు.

దేశాభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకం



మాట్లాడుతున్న విజయకుమార్

మండవల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని మండవల్లి జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం జి. శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సుధామ ఫౌండేషన్ అధినేత ప్రొఫెసర్ సుదాబత్తుల విజయకుమార్ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ దేశాభివృద్ధికి ఇంజనీర్ల పాత్ర కీలకమని, వారి ప్రాధాన్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువ ఇంజనీర్లు పి. నాగబాబు, ఎం. అజయ్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు రాజశేఖర్

సేవా పక్షోత్సవాలు విజయవంతం చేయండి

చాట్రాయి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పుట్టినరోజు సందర్భంగా జరప తలపెట్టిన సేవా పక్షోత్సవాలను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా నాయకుడు మల్లెపూడి రాజశేఖర్ కోరారు. చాట్రాయిలో ఆ పార్టీ నాయకుడు గడ్డం సంజీవరెడ్డి గృహంలో సోమవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 17న ప్రధాని పుట్టిన రోజు కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించాలని కోరారు. ప్రభుత్వం తరఫున ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారని, మహిళలు, బాలికలకు వైద్య పరీక్షలు చేయించటానికి కృషి చెయ్యాలన్నారు. బీజేపీ నాయకులు బోను అప్పారావు, ఓబిళ్ళనేని రాజా, ద్రోణంరాజు శ్రీనివాసరావు, ముత్తారెడ్డి, చాగంటి వాసు, పోతిరెడ్డిపల్లి చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.




ఉత్సవ కమిటీ సభ్యులను సత్కరిస్తున్న ఈవో శేఖర్

శ్రీ శ్యామలాంబ దసరా ఉత్సవ కమిటీ నియామకం

కైకలూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారి శ్రీ చండీ మహాయాగ సహిత శరన్నవరాత్రి మహోత్సవాల నిర్వహణకు ఉత్సవ కమిటీని నియమించినట్టు ఆలయ ఈవో వీఎన్‌కే శేఖర్ తెలిపారు. సోమవారం నూతన ఉత్సవ కమిటీ సభ్యులను సత్కరించారు. ఈ నెల 22 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు జరిగే దసరా మహోత్సవాల్లో ఉత్సవ కమిటీ సభ్యులుగా జంపన రామలింగరాజు, సింహాద్రి రాంబాబు, పోతునూరి సుజాత, అన్నం వెంకట అంజని, నాగనబోయిన నాంచారయ్య, దేవరపల్లి శర్మ, కటికన పద్మావతి, గాదంశెట్టి ఉషారాణి, గొల్లు గౌరిశ్రీ, ఇంటి ఝాన్సీ రాణి, పంద్రంగి కనకదుర్గా ప్రసాద్‌ను నియమించినట్లు వివరించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475

ఇన్‌చార్జ్‌లతోనే విధులు



పెదలంక గ్రామ సచివాలయం

- పెదలంక సచివాలయంలో సిబ్బంది కొరత
- వైసీపీ హయాంలో సచివాలయ వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి ఇదే తీరు
- ప్రజలకు తప్పని తిప్పలు

కలిదిండి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పెదలంక గ్రామ సచివాలయంలో ఐదేళ్లుగా సిబ్బంది కొరత ఉండటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ మాత్రమే ఉండగా, ఆ ఉద్యోగి ప్రమాదానికి గురై సెలవులో ఉన్నారు. సచివాలయంలో ఉన్న ప్రస్తుత పర్మినెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇన్‌చార్జ్‌లతో కాలక్షేపం చేస్తున్నారు. పెదలంక పంచాయతీ పరిధిలో పెదలంక, పల్లిపాలెం, దళితవాడ, అప్పారావుపేట, పెదపుట్లపూడి గ్రామాలు ఉన్నాయి. సుమారు 6 వేల మంది జనాభా ఉన్నారు. మండలంలో కోరుకొల్లు, కలిదిండి మేజర్ పంచాయతీల తర్వాత అధిక జనాభా గల పెదలంక సచివాలయంలో వైసీపీ హయాంలో సచివాలయ వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి సిబ్బందిని పూర్తిగా నియమించలేదని ఇన్‌చార్జ్‌లే విధులు నిర్వహిస్తున్నా రని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇన్‌చార్జ్ అధికారులు అందుబాటులో లేకపోవటంతో ఇబ్బందులు పడుతు న్నామని వాపోతున్నారు. సచివాలయంలో పర్మినెంట్ సిబ్బందిని నియమించాలని పాలకులకు, అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవటం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సచివాలయంలో పూర్తిగా పర్మినెంట్ సిబ్బందిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళతారో తెలియదు



ఐదేళ్లుగా సచివాలయంలో ఇన్‌చార్జ్ అధికారులతో కాలక్షేపం చేస్తున్నారు. వీరు అందుబాటులో లేకపోవటంతో ఇబ్బందులు పడుతున్నాం. ఇటీవల పర్మినెంట్ సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ బదిలీపై వెళ్లిపోగా ఆయన స్థానంలో వచ్చిన వ్యక్తి ప్రమాదానికి గురై సెలవులో ఉండడంతో ప్రస్తుత సిబ్బంది ఇన్‌చార్జ్‌లే కావటంతో ఎప్పుడు వస్తున్నారో, ఎప్పుడు వెళ్తున్నారో తెలియటం లేదు.

-దుగ్గిరాల పరమేశ్వరరావు, గ్రామస్థుడు



విద్యార్థుల ప్రగతిని పరిశీలిస్తున్న ఎంఈవో-2 నరేష్ కుమార్

విద్యార్థుల సామర్థ్యం పెంపునకు కృషి చేయాలి

ముదినేపల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు మరింత ప్రణాళికా వ్యవహరించాలని ముదినేపల్లి ఎంఈవో-2 కె.నరేష్ కుమార్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని కాకరవాడ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించారు. పాఠ్య పుస్తకాలను చదివించారు. ఎఫ్ఏ-1 పరీక్షల ఆధారంగా విద్యార్థుల వెనుకబాటుతనాన్ని తగ్గించి, సామర్థ్యాన్ని పెంచేందుకు కృషి చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలులో మెనూను తప్పకుండా అమలు చేయాలని సూచించారు.

కీటకాలకు బ్రహ్మాస్త్రంతో చెక్

మండవల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆకుముడత పురుగు నివారణకు బ్రహ్మాస్త్రం ఎంతో మేలని ప్రకృతి వ్యవసాయ సీఆర్పీ గౌతమ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని అల్లినగరంలో ప్రకృతి వ్యవసాయ రైతులకు అందుబాటులో ఉంచేందుకు పచ్చపురుగు, ఆకుముడత, లద్దెపురుగు నివారణకు బ్రహ్మాస్త్రం తయారు చేశారు. రైతులు ఖర్చు తగ్గించుకుని నాణ్యమైన ఆహార ఉత్పత్తులను పొందడానికి ప్రకృతి వ్యవసాయం మంచి మార్గమని సూచించారు. అలాగే అన్నిరకాల పంటలకు కావాల్సిన కషాయాలు, ద్రావణాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దోషులపై అట్రాసిటీ కేసులు నమోదు చేయాలి

మాజీ ఎంపీ హర్షకుమార్



గాయపడిన వారి కుటుంబాలను పరామర్శిస్తున్న హర్షకుమార్

కైకలూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): దానగూడెం ఘటనలో దాడులకు పాల్పడిన వారందరినీ కఠినంగా శిక్షించాలని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం కైకలూరు శివారు దానగూడెంలో వినాయక నిమజ్జనంలో జరిగిన గొడవల్లో గాయపడిన యువకుల కుటుంబీకులను ఆయన పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జనసేన నాయకుడు కొల్లి వరప్రసాద్(బాబీ)ని అరెస్టు చేయాలని, మూడు రోజుల్లో దాడులకు పాల్పడిన వారందరిపై పోలీసులు అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని లేకుంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సేవా నాగ జగన్ బాబూరావు, ఎస్సీ సెల్ నాయకులు మత్తే రవి, తదితరులు పాల్గొన్నారు.

కులాలను రెచ్చగొడితే సహించం



విలేకర్లతో మాట్లాడుతున్న టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు

కైకలూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దానగూడెం ఘటనపై వైసీపీ నాయకుల దుష్ప్రచారాన్ని టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు ఖండించారు. సోమవారం కైకలూరులో విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల దానగూడెం ఘటనపై మాజీ ఎమ్మెల్యే దూలం చేసిన ఆరోపణలకు వారు తీవ్రస్థాయిలో స్పందించారు. దాడులపై ఇప్పటికే పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి జైలుకు పంపారని ఈ విషయాన్ని మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు గుర్తించాలన్నారు. గత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు దెబ్బలు తిన్న బాధితులపైనే కేసులు నమోదు చేసేదని, ఎన్డీయే ప్రభుత్వంలో ఎవరైనా తప్పుచేస్తే ఖచ్చితంగా వారిపైనే కేసులు నమోదు చేస్తున్నారనే విషయాన్ని గ్రహించాలన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కులాల మధ్య చిచ్చు పెట్టి లబ్ధి పొందాలని చూడడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు వీరాబత్తిన సుధా, పళ్లెం ఏడుకొండలు, చాబత్తిన విజయ్, సదర్ల సూరి, వాసిపల్లి సతీష్‌కన్నా, కూరేళ్ళ ఇస్సాక్, ఓగిరాల శ్రీకాంత్, కత్తే సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల పేరిట మోసం!

వైసీపీ నేత ఇంటి వద్ద బాధితుల ఆందోళన.. సొమ్ము చెల్లించాలని డిమాండ్



మోరు రామరాజు ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న వడ్డిగూడెం గ్రామస్థులు

ఏలూరురూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలోని పెదపాడు మండలం వడ్డి గూడెం గ్రామానికి చెందిన వైసీపీ నేత మోసానికి పాల్పడ్డారంటూ పలువురు ఆందోళనకు దిగారు. గత వైసీపీ పాలనలో ఇంటి స్థలాలు ఇప్పిస్తానంటూ సుమారు రూ.57 లక్షలు తీసుకుని ఇవ్వకుండా తమను మోసం చేశాడంటూ వారు ఆరోపించారు. ఈ మేరకు బాధితులు సోమవారం శనివారపుపేటలోని కట్టా సుబ్బారావుతోటలోని ఆయన ఇంటి వద్ద ఆందోళన నిర్వహించారు. తమకు డబ్బు తిరిగి చెల్లించాలని నినాదాలు చేశారు. బాధితులు ముంగర విష్ణు, జయమంగళ హరి బాబు, ఘంటసాల మారుతి, సర్పంచ్ జయ మంగళ దేవి మాట్లాడుతూ మోరు రామరాజు అనేవ్యక్తి 15 ఏళ్ల క్రితం, పొలం కొనుగోలు చేసి, స్థలాలు ఇస్తామంటూ 560 మంది నుంచి రెండో విడతగా సుమారు రూ. 57 లక్షలు వసూలు చేశారన్నారు. వడ్డిగూడెం గ్రామస్థులు సొసైటీగా ఏర్పరుచుకున్న చేపల చెరువు లీజుకు తీసుకుని వాటి డబ్బు కూడా ఇవ్వడం లేదని ఆరో పించారు. కాలం గడిచే కొద్ది స్థలాలు రిజిస్ట్రేషన్ చేయించకుండా తమ డబ్బులు తిరిగి ఇవ్వడం లేదని ఆరోపించారు. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో అడిగిన వారిపై రామరాజు దౌర్జన్యం చేసేవారంటూ ఆరోపించారు. ఇటీవల తమకు న్యాయం చేయాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను కోరగా ఇదే విషయంపై మోరు రామరాజు సోషల్ మీడియా వేదికగా ఎమ్మెల్యేపై దుర్భాషలాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగే వరకు ఇక్కడే బైఠాయిస్తామని మహిళలు హెచ్చరించారు. మధ్యాహ్నం అక్కడే టీ కాచుకుని తాగి నిరసన కొనసాగించారు. త్రీ టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, బాధితులను సముదాయించే ప్రయత్నం చేయగా వారు ఆందోళనను కొనసాగించారు.

ఘంటసాల మారుతి, బసవ శాస్త్రి, మోరు వెంకన్న, జయ మంగళ దుర్గాబాబు, భలే వీర్రాజు, మోరు సత్తిరాజు, గంటసాల సుబ్బరాజు, ముంగర రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

పశువులకు టీకాల పంపిణీ



వేల్పుచర్లలో పశువులకు టీకా వేస్తున్న డాక్టర్ చైతన్య

మునునూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఉన్న పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీని చేపట్టినట్లు పశువైద్యాధికారి ఎం.వెంకట చైతన్య తెలిపారు. సోమవారం వేల్పుచర్లలో సుమారు 155 పశువులకు సిబ్బందితో కలిసి టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ పశువ్యాధి నివారణ కార్య క్రమంలో భాగంగా గాలికుంటు వ్యాధికి నివారణ టీకాలను వేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ ప్రక్రియ అక్టోబరు 15 వరకు జరుగుతుందన్నారు.

నూజివీడు టౌన్: గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించటం వల్ల పశువులకు ఆ వ్యాధి సోకకుండా చూడవచ్చని నూజివీడు మండల పశువైద్య అధికారిణి దుర్గాభవాని అన్నారు. నూజివీడు మండలం బత్తులవారిగూడెంలో ఉచిత వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సర్పంచ్ ముసునూరి లక్ష్మీకాంతమ్మ ప్రారంభించారు. తొలిరోజు 300 పశువులకు టీకాలను వేసినట్లు ఆమె తెలిపారు.

కలిదిండి: కలిదిండి, తాడినాడ, భాస్కరరావుపేట గ్రామాల్లో 400 పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశామని మండల పశువైద్యాధికారి ప్రహర్ష తెలిపారు. గ్రామాల వారిగా నెలరోజులపాటు పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేస్తామన్నారు. పశుపోషకులు సహకరించాలని కోరారు.

మళ్లీ గోదావర్రీ!

(5వ పేజీ తరువాయి)



బలివే వద్ద తమ్మిలేరులో వరదనీటి ప్రవాహం

సోమవారం ఉదయం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో కొండవాగులు పొంగాయి. రెడ్డి గణపవరం జల్లేరు కొండవాగు పొంగ డంతో రాకపోకలు నిలిచిపోయాయి రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి వాగు కొట్టుకు పోవడంతో గ్రావెల్‌తో తాత్కాలిక మరమ్మతులు చేశారు. సోమవారం ఉదయం మరలా వర్షం కురవడంతో తాత్కాలిక రోడ్డుకు కష్టాలు తప్పలేదు.

తమ్మిలేరులో కొనసాగుతున్న వరద

ముసునూరు: మండల పరిధిలో తమ్మిలేరు వరద ఉధృతి కొనసాగుతోంది. సోమవారం తహసీల్దార్ దాసరి ప్రశాంతి, ఎస్ఐ ఎం.చిరంజీవి వరద ప్రవాహన్ని పరిశీలించారు. తమ్మిలేరు పరీవాహక గ్రామాలైన గుళ్ళపూడి, లోపూడి, వలసపల్లి, యల్లాపురం, బలివే, రంగంపేట, వేల్పుచర్ల గ్రామాల్లో ఉన్న ర్యాంపుల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గ్రామస్థాయి అధికారులు, పోలీసులతో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ తెలిపారు.

ఇళ్లు సరే.. ఇంకుడు గుంతలేవీ?

(5వ పేజీ తరువాయి)

మాత్రమే ఇంకుడు గుంతలున్నాయి. నిర్వహణ లేక అవీ నిరుపయోగంగా ఉన్నాయి. ఇదిలా ఉండగా గతంలో నిర్మించిన ఇంకుడు గుంతలు కొద్దిపాటి మరమ్మతులు చేస్తే.. అవి మళ్లీ వినియోగించే అవకాశం ఉన్న వివిధ ప్రభుత్వశాఖల్లో వాటిని పట్టించుకోవడం లేదు.

అందరూ నడుం బిగిస్తేనే...

ప్రతీ మూడో శనివారం ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా ఇంకుడు గుంతల నిర్వహణపై కాస్తంతా ప్రచారం, పర్యవేక్షణ చేయించాల్సిన అవసరం ఉంది. భూగర్భ జల వనరులు పుష్కలంగా ఉంటే నీటికి కొదవ ఉండదు. కాల్వల నుంచి నీరు రాకపోయినా బోర్లు, బావులు ఆ అవసరాలను తీరుస్తాయి. గతేడాది నుంచి ఇటీవల వర్షాకాలం భారీ వర్షాలే కురిశాయి. దీంతో భూగర్భజల మట్టం పెరిగింది. ఆశించిన స్థాయిలో వర్షాలు పడకుంటే మార్చి, ఏప్రిల్, మే, జూన్ నెలల్లో పట్టణాల్లో తాగునీటికి కటకటలాడాల్సిన పరిస్థితి నెలకుంటుంది. భవిష్యత్‌లో తాగునీటి ఎద్దడిని తప్పించుకోవాలంటే ప్రతి ఒక్కరూ నీటి పొదుపునకు నడుం బిగించాలి. నివాస ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి నీరు ఇంకేలా చేయాలి.

మండవల్లి పంచాయతీలో.. ఉద్యోగులను నియమించాలని వినతి

మండవల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండవల్లి మేజర్ పంచాయతీలో పర్మినెంట్ కార్యదర్శి, డిజిటల్ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అధికారులకు ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక నాయకులు ఫిర్యాదు చేశారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ గోపాల్‌కు, మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్‌కు వినతిపత్రాలు అందించారు. సచివాలయంలో డిజిటల్ అసిస్టెంటు లేక రైతులు, ప్రజలు మీ సేవ వద్దకు వెళ్లి అధిక సొమ్ములు ఇచ్చి పనులు చేయించుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండవల్లి మేజర్ పంచాయతీకి ఇన్‌చార్జి కార్యదర్శిని నియమించడంతో ఆమె ఎప్పుడు ఉంటారో తెలియక ప్రజలు కార్యాలయానికి పలుమార్లు వచ్చి వెళుతున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పర్మినెంటు కార్యదర్శిని నియమించాలని ఐక్యవేదిక గ్రామ కార్యదర్శి ఎల్ఎస్ భాస్కరరావు తదితరులు విజ్ఞప్తి చేశారు.

కల్వర్టుల నిర్మాణానికి శ్రీకారం

ముదినేపల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదగొన్నూరు పంచాయతీ పరిధిలో పలు చోట్ల పంట మురుగు కాల్వలకు పైపు కల్వర్టుల నిర్మాణ పనులను చేపట్టారు. విశ్వనాద్రిపాలెం నుంచి ఉప్పరగూడెం గ్రామం వరకు ఆరు పైపు కల్వర్టుల నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. పంట, మురుగు నీటి ప్రవాహానికి సౌకర్యాన్ని మెరుగు పర్చటంతో పాటు వాహనాల రాకపోకలకు కూడా అనువుగా ఉండేలా పాత కల్వర్టుల స్థానంలో నూతన కల్వర్టులను పంచాయతీ నిధులతో నిర్మిస్తున్నారు. సుమారు రూ.2 లక్షల పంచాయతీ నిధులతో కాల్వలకు తూములు ఏర్పాటు చేస్తున్నామని, ఆర్అండ్‌బీ అధికారులు ఆయా ప్రదేశాల్లో రక్షణ గోడలు నిర్మిస్తారని సర్పంచ్ తాడంకి శిరీష తెలిపారు.

'చల్లగుళ్ళ'కు అబ్బయ్య చౌదరి నివాళి

చాట్రాయి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తగూడెంలో సోమవారం చాట్రాయి వైస్ ఎంపీపీ చల్లగుళ్ళ జగన్మోహనరావు దశదినకర్మలో దెందులూరు మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రాష్ట్ర సహకార యూనియన్ మాజీ చైర్మెన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, నాయకులు సుబ్బారెడ్డి, కారంగుల వాసు, మిద్దె శివాజీ, సిహెచ్ వెంకటేశ్వరరావు, శోభనబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల్లో నష్ట నివారణ చర్యలు చేపట్టాలి

చాట్రాయి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): అధిక వర్షాల వల్ల ఉద్యాన పంటల్లో రైతులు నష్ట నివారణ చర్యలు చేపట్టాలని మండల ఇన్‌చార్జి ఉద్యానశాఖ అధికారి ఆర్. హేమ సూచించారు. మామిడిలో ఆకులకు పొటాషియం నైట్రేట్ ఐదు గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. ఆయిల్‌పామ్‌లో లేత మొక్కల మువ్వ మునిగినట్టయితే బావిస్టన్ మూడు గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి మువ్వలో పోసి మొక్కంతా తడిచేలా పిచికారీ చెయ్యాలన్నారు. ఇంకా కొబ్బరి, అరటి, బొప్పాయి, కూరగాయల పంటలకు నష్ట నివారణ చర్యలపై వివరించారు.

క్రైమ్ కార్నర్



రామిలేరులో గల్లంతైన యువతి మృతదేహం లభ్యం

నూజివీడు టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రామిలేరులో గల్లంతైన యువతి బడిపాటి నీరజ మృతదేహాన్ని ఎండీఆర్ఎఫ్ బృందం వెలికితీసింది. నూజివీడు మండలం తుక్కులూరు గ్రామానికి చెందిన బడిపాటి నీరజ ఆదివారం చర్చికి వెళ్ళి తిరిగి వస్తూ రామిలేరు వాగులో గల్లంతైన విషయం తెలిసిందే. గాలింపు చర్యలు చేపట్టిన ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సోమవారం ఆమె మృతదేహాన్ని కనుగొన్నాయి. ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టంకు తరలించారు. ఈ ఘటనతో తుక్కులూరు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

కేబుల్ దొంగలు దొరికారు

చాట్రాయి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పొలాల్లో మోటార్లు, కేబుల్ వైర్లు చోరీ చేస్తున్న ఇద్దరు నిందితులను సోమవారం అరెస్ట్ చేసినట్లు నూజివీడు రూరల్ సీఐ కె. రామకృష్ణ, చాట్రాయి ఎస్ఐ డి. రామకృష్ణ తెలిపారు. మండలంలోని తుమ్మగూడెం గ్రామానికి చెందిన నిందితులు యర్రా నాగవాసు, మాదల భవానీ శంకర్‌లను అరెస్ట్ చేశామని, వీరిపై చాట్రాయి పోలీస్‌స్టేషన్‌లో 4 కేసులు ఉన్నట్లు చెప్పారు. నిందితుల నుంచి రూ. 1.50 లక్షలు విలువైన 3 మోటార్లు, ఒక పంపు, 900 అడుగులు కరెంట్ కేబుల్ వైరు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులను అరెస్ట్ చేయటంలో ప్రతిభ చూపిన ఎస్ఐ డి. రామకృష్ణ, హెచ్‌సీ శ్రీనివాసరావు, పీసీలు మునీంద్రరావు, వెంకటేశ్వరరావును సీఐ అభినందించారు.

కత్తితో దాడి చేసిన నిందితుడి అరెస్టు

ముదినేపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం పెదగొన్నూరు శివారు విశ్వనాద్రిపాలెం గ్రామంలో వీరంకి వెంకటేశ్వరమ్మ అనే మహిళ మెడలోని బంగారు గొలుసును అపహరించేందుకు యత్నించి ఆమెపై కత్తితో దాడి చేసిన ఘటనలో నిందితుడిని సోమవారం ముదినేపల్లి ఎస్ఐ వీరభద్ర రావు అరెస్టు చేశారు. మండవల్లి మండలం చావలిపాడు గ్రామానికి చెందిన ఇసున్నపల్లి అనిల్ కుమార్‌ను పెయ్యేరు గ్రామ సమీపంలోని మురుగు కాల్వ వద్ద గుర్తించి అరెస్టు చేసి కైకలూరు జూనియర్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచినట్టు ఎస్ఐ వివరించారు.